ముక్తి ప్రదాయిని

గురు శిష్య సంవాదము

అచల గురు శ్రీ పోకల శేషాచల స్వాముల వారు

ప్రకాశకులు :

శ్రీ సహజానంద ముద్రబోయిన సుబ్బారావార్యులు

పీఠాధిపతి

శ్రీ పోలకం నరసింహ స్వాముల వారి అచల మందిరము,

ఇప్పటం గ్రామం, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.

Scanned by TapScanner

శ్రీ గురవేనమః

ముక్తి ప్రదాయిని

అను

గురు శిష్య సంవాదము

గ్రంథకర్త :

శ్రీ తిరుచునాపల్లి రంగస్వామిసెట్టి గారు

అచల గురువులు శ్రీ పోకల శేషాచల స్వాముల వారి సాంప్రదాయకులు
శ్రీ పోలకం నరసింహ స్వాముల వారి శత వార్షిక ఆరాధన సందర్భంగా
ఏతత్ పీఠ గ్రంధంబైన "ముక్తి ప్రదాయిని అను గురు శిష్య సంవాదము"
సరిచూడబడి పునఃప్రచురణ చేయడమైనది.

ప్రకాశకులు :

శ్రీ సహజానంద ముద్రబోయిన సుబ్బారావార్యులు,
పీఠాధిపతి

శ్రీ పోలకం నరసింహ స్వాముల వారి అచల మందిరము,
ఇప్పటం గ్రామము, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.

Scanned by TapScanner

విషయసూచిక

1. భక్తిమార్గము ... 3

2. యోగమార్గము ... 9

3. జ్ఞానమార్గము ... 17

4. అచలమార్గము ... 53

ఈ గ్రంధము భక్తులును, యోగులును, జ్ఞానులును, అచలులును జదివియును, వినియును నానందించుకొఱకై యనేక దృష్టాంతములను బ్రయోగించితిని. ఇందు బ్రమాద దోషంబులేమైన నుండిన యెడల బెద్దలు సవరించి మన్నింతురని కోరుచున్నాడను. – సవరణ కర్త

నూతన ముద్రణ : అక్టోబరు, **2017**

వెల : రూ. **50** మాత్రమే

All rights reserved with
Sri Polakam Narasimha Swamula Vari Achala Mandiram, Ippatam.

డి.టి.పి. మరియు డిజైనింగ్ :
బి. అనూష, ఆర్.వి.ఆర్. గ్రాఫిక్స్, తెనాలి.
సెల్ : 9849274463, 9246230222

ముద్రణ :
ఆనంద్ ఆఫ్‌సెట్, తెనాలి.

Scanned by TapScanner

శ్రీ గురుభ్యోన్నమః

ముక్తి ప్రదాయిని అను,
గురు శిష్య సంవాదము

హరిః ఓమ్

శ్లోకం॥ గురుర్బ్రహ్మ గురుర్విష్ణు ర్గురుదేవో మహేశ్వరః।
గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీగురువేనమః॥

భక్తిమార్గము

ప్రశ్న :- స్వామి! లోకమునందు బురుషార్థము లెన్ని విధములు?

ఉత్త :- శిష్యా! పురుషార్థమని పరమపురుషార్థమని రెండు విధములు.

ప్రశ్న :- పురుషార్థము లనగానేవ్వి?

ఉత్త :- ధర్మార్థకామముల మూటిని బురుషార్థములుగా జెప్పుదురు.

ప్రశ్న :- పరమ పురుషార్థమనగా నేది?

ఉత్త :- మోక్షమని చెప్పబడును.

ప్రశ్న :- అయితే ధర్మార్థకామమోక్షములను నీ నాలుగు పురుషార్థములు సకల జీవకోటులను నాచరింపదగునా?

ఉత్త :- ధర్మార్థ కామములను మూడు మాత్రమే - సకల ప్రాణకోటిచే నాచరింప దగినవే కాని, మోక్షము మాత్రము మనుష్యులచే నాచరింపదగినది కాబట్టి మానవ జన్మమెత్తినందుకు ఫలమేమనగా జ్ఞానము గలిగి మోక్షము సాధించుటయే ఫలము, అట్టి జ్ఞానము లేని మానవులు పశుప్రాయులని యెన్నబడుదురు. ఇందుకు సమ్మతము.

శ్లో॥ ఆహారనిద్రాభయమైథునంచ। సామాన్యమే తత్పశుభిర్న రాణాం
జ్ఞానంన రాణామధికంలి శేషో। జ్ఞానేనహీన: పశుభిస్సమాన: ॥
అని యున్నది.

Scanned by TapScanner

ప్రశ్న :- మోక్ష పదవి లెన్ని విధములు?

ఉత్త :- సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్య, సాష్టిత్వ, విదేహ కైవల్యమనెడి మోక్షమను పదవు లాఱు విధములు.

ప్రశ్న :- అట్టి పదవులు ప్రాప్తించుటకు సాధనాంతరము లెయ్యవి?

ఉత్త :- భక్తి - వైరాగ్య - యోగ - జ్ఞానము లని నాలుగు విధములు.

ప్రశ్న :- భక్తి వైరాగ్యముల వలన బొందదగినవి యెయ్యవి?

ఉత్త :- సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యంబులను నాలుగును భక్తి వైరాగ్యముల వలన బొందదగినవి.

ప్రశ్న :- సాలోక్య మనగా నెటువంటిది?

ఉత్త :- శ్రీహరిలోక మందుండుట.

ప్రశ్న :- సామీప్య మనగా నెటువంటిది?

ఉత్త :- శ్రీహరి వలె చతుర్భుజాది చిహ్నములు గలవాడై యుండుట.

ప్రశ్న :- సాయుజ్య మనగా నెటువంటిది?

ఉత్త :- శ్రీహరియం దైక్యమగుట.

ప్రశ్న :- అయితే భక్తి యెన్ని విధములు?

ఉత్త :- బాహ్యభక్తి, అనన్యభక్తి, ఏకాంతభక్తి - అని మూడు విధములు.

ప్రశ్న :- బాహ్య భక్తి అనగా నెటువంటిది?

ఉత్త :- శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మనివేదనము అనెడి తొమ్మిది విధములైన భక్తిచే శ్రీమహావిష్ణువును ధ్యానించుట.

ప్రశ్న :- ఈ శ్రవణాది నవవిధ భక్తిమార్గములు వివరముగా జెప్పుడు?

ఉత్త :- శ్రవణము - అనగా శ్రీమహావిష్ణు చరిత్రంబుల బ్రేమతో వినుట.
కీర్తనము - అనగా శ్రీహరి లీలావినోద చరిత్రములను నత్యాశక్తితో బాడుట;

స్మరణము – అనగా శ్రీమహావిష్ణువు యొక్క యనంత నామము లత్యంత భక్తితో స్మరించుట.

పాదసేవనము, అనగా – శ్రీమన్నారాయణుని దివ్యపాద పద్మములు హృదయమందు నిలుపుట.

అర్చనము అనగా శ్రీరమాధవుని మానస పూజచేయుట.

వందనము – అనగా శ్రీగోవిందుని యొక్క సర్వావయవములను, వేర్వేఱుగా ధ్యానిము చేసి మనోవందనంబులు చేయుట.

దాస్యము – అనగా శ్రీజనార్ధనుని సర్వకాల సర్వావస్థలందును మఱువక ధ్యానము సేయుట

సఖ్యము – అనగా శ్రీపద్మనాభుని యొక్క ధ్యాన పరాయణుండై యనన్యవృత్తితో నుండుట.

ఆత్మనివేదనము – అనగా నట్టి పురుషోత్తమునియందు నిశ్చల హృదయమును సమర్పించుట.

ప్రశ్న :– నన్య భక్తి యనగా నెటువంటిది?

ఉత్త :– సకల ప్రపంచము విష్ణుమయమనియును. విష్ణువు సర్వమయుడ నియును, విష్ణుమయముగాని వస్తువు లేశమైనను లేదనియుం దలంచుచు నిశ్చయాత్మకుడై యుండుట.

ప్రశ్న :– ఏకాంతభక్తి, యనగా నెటువంటిది?

ఉత్త :– పరబ్రహ్మమై, పరమాత్మ స్వరూపుడై, సకల జీవ కోటులకు వెలుపల, లోపల, ముందు వెనుక, నిరుపార్శ్వములను నిండి నిబిడీకృతమై, సకల కారకుండై యుండు విష్ణువునందు (సముద్రము నందు వాయువశము చేత దరంగములు పుట్టిన విధముగా) మాయా ప్రపంచము కలిగినదని సందేహము లేక సర్వసాక్షి భూతుడై యుండెడి శ్రీహరిని జ్యోతి రూపముగా దలంచి తదేక నిష్ఠాపరుండై యుండుట, స్వాశ్రమ విహిత కర్మ చేయక కేవల భక్తి వృద్ధిపొందదు.

Scanned by TapScanner

ప్రశ్న :- అయితే బాహ్య భక్తి కలవాడేయే కర్మ లాచరించును ?

ఉత్త :- తన యాశ్రమోచితములగు కర్మలాచరించుచు ఫలకాంక్షియై యుండును.

ప్రశ్న :- అనన్య భక్తి కలవాడేయే కర్మ లాచరించును ?

ఉత్త :- తన యాశ్రమోచిత కర్మంబులు ఫలత్యాగియై భగవన్నియామకంబులని సేయుచుండును.

ప్రశ్న :- ఏకాంత భక్తి కలవాడేయే కర్మ లాచరించును ?

ఉత్త :- కర్మ యీశ్వరాజ్ఞ గావున గర్మవ్యతిరి క్తమైన భక్తి చే నీశ్వరుడు సంతోషించడని తలంచి ఫలకాంక్షిగాక, యథావిహిత కర్మములను నీశ్వరార్పణములుగా జేయుచుండును. కనుక బాహ్యభక్తి యనన్య భక్తికిని, ననన్యభక్తి యే కాంత భక్తికిని, సాదనములై యుండును.

ప్రశ్న :- ఈ త్రివిధములైన భక్తి మార్గములో నేభక్తి యేపదంబును నొసంగును ?

ఉత్త :- బాహ్యభక్తి సాలోక్యంబు నిచ్చును ఈ భక్తి దృఢముగా నుండిన యెడల సామీప్యంబు నిచ్చును.

అనన్య భక్తి సారూప్యంబు నిచ్చును.

ఏకాంతభక్తి సాయుజ్యంబు నిచ్చును.

ప్రశ్న :- కర్మవినాభక్తి వృద్ధిపొందదని చెప్పితిరి గదా? కర్మప్రచారం బెటువంటిది ?

ఉత్త :- కర్మలు లౌకికమనియు, వైదికమనియు రెండు విధములు.

ప్రశ్న :- లౌకిక కర్మయనగా నెటువంటిది ?

ఉత్త :- లోక వ్యవహార కార్యము లన్నియు లౌకిక కర్మలని చెప్పబడును.

ప్రశ్న :- వైదిక కర్మ యనగా నెటువంటిది ?

ఉత్త :- నిత్యమనియు, నైమిత్తికమనియు, గామ్యమనియు, నిషిద్ధమనియు, బ్రాయశ్చిత్తమనియు నైదు విధములుగా గలది.

ప్రశ్న :- నిత్యకర్మ యనగా నెటువంటిది ?

ఉత్త :- స్నాన, సంధ్యావందన, జప, తప, హోమ, దేవతర్పణ, వైశ్వదేవ, అతిథిపూజ మొదలగునవి.

ప్రశ్న :- నైమిత్తిక కర్మ యనగా నెటువంటిది ?

ఉత్త :- ఒక నిమిత్తమును ననుసరించి చేయునది. అనగా సంక్రాంతియుత్తరాయణ, దక్షిణాయణ, అర్థోదయ, మహోదయ ములు మొదలగు పర్వదినముల యందు గాలము తప్పక స్నాన జపాదులు చేయునది.

ప్రశ్న :- కామ్య కర్మయనగా నెటువంటిది ?

ఉత్త :- అశ్వమేధ, రాజసూయ, పౌండరీక, సోమము మొదలగు యజ్ఞములను జేయుట.

ప్రశ్న :- నిషిద్ధకర్మ యనగా నెటువంటిది ?

ఉత్త :- శాస్త్రములయందు నిషేధింపబడ్డది, అనగా? పరద్రవ్యాపహార పరనింద, పరదారగమన, పరహింస, మద్యపాన, చోరానృతాదులు.

ప్రశ్న :- ప్రాయశ్చిత్త కర్మ యనగా నెటువంటిది ?

ఉత్త :- శాస్త్రనిషిద్ధ కర్మలాచరించి నందువలన వచ్చిన దోషములను బరిహరించుటకై చేయు కర్మలనగా నరణ్యావాసము, జలభక్షణ, వాయుభక్షణ, పర్ణభక్షణ, తీర్థయాత్ర, చాన్ద్రాయణ, పంచక వ్యాధికర్మములు చేయుట.

ప్రశ్న :- ఇట్టి కర్మలాచరించి నందువలన గల్గు ఫలమేమి?

ఉత్త :- నిత్య నైమిత్తిక కర్మలు, యావజ్జీవ పర్యంతము చేసి నట్టులయితే ప్రారబ్ధము నశించును. కామ్య కర్మల వలన స్వర్గాది భోగములు కల్గునుగాని విదేహ కైవల్యము కలుగదు. మఱల జననమరణ ములు గల్గును ఇందుకు సమ్మతము.

Scanned by TapScanner

శ్లో॥ జ్యోతిష్టోమోస్వర్గ కామోయజేత। క్షీణేపుణ్యమర్త్య లోకేవిశన్తి ॥
అని స్మృతి ప్రమాణమున్నది నిషిద్ధకర్మ చేసినట్టులయిన నరక ప్రాప్తి కలుగును.

ప్రాయశ్చిత్త కర్మ లాచరించినట్లయితే, నిషిద్ధకర్మల వలన వచ్చు ప్రత్యవాయమును బోగొట్టి పురుషునకు మరల గర్మాధి కారము గలుగజేయును. ఈ యైదు కర్మలలో గామ్య నిషిద్ధ ప్రాయశ్చిత్తములను మూడు కర్మలు జ్ఞానసాధనములు కావు. పైన జెప్పబడిన నిత్యనైమిత్తికములను రెండు కర్మలు సాత్విక, రాజస తామసములని మూడు విధములయ్యె. ఈ మూడింటిలో రాజస తామసములను రెండు కర్మలు జనన మరణ వృద్ధి కారణములే గాని, జ్ఞానమునకు గారణములు గావు. సాత్విక కర్మఫల కాంక్షిగాక, యీశ్వరార్పణముగా జేసినట్టయిన జిత్తశుద్ధి గలుగును. కర్మజ్ఞానమునకు విరోధికాదు. గనుక కర్మచే నజ్ఞానము నశింపదు. చీకటి మేఘావరణము చేత, వృద్ధి పొందునటుల నధికమౌను. కర్మ కర్తృత్వము గలుగ జేయునది గనుక, నజ్ఞానమును దొలగ జేయజాలదు. అది యేలాగనిన దన కర్థము తెలియని యొకశ్లోకము యొక్క యర్థము, గంగాస్నానము చేసినప్పటికిని, లక్షగాయిత్రీజపము చేసినప్పటికిని దెలియదు. దాని యర్థము దెలిసిన వారిని నడిగి తెలిసికొనవలెను. దినశుద్ధి తెలియగలందులకు బంచాంగము ద్వారా తెలియవలెనుగాని, యితర సాధనముల చేదెలియదు. కాబట్టి కర్మచే జ్ఞానము రానేరదు. చిత్తశుద్ధి వలన సద్గురు లాభమును, సద్గురు లాభము వలన శ్రవణమును, శ్రవణము వలన జ్ఞానమును కలుగును. కాబట్టి సత్వగుణాధిష్టితమైన కర్మ చిత్తశుద్ధికి గారణమవును. మోక్షమునకు సాక్షాత్సాధనము కాదు. ఇందుకు సమ్మతము.

Scanned by TapScanner

శ్లో॥ జ్ఞానకర్మ పదార్థౌద్వౌ । భాస్య భాసకలక్షణా ।

జ్ఞానాన్మోక్షో నకర్మభ్యాః। ఇతి వేదాంతడిండిమః॥ అని యున్నది.

ప్రశ్న :- అయితే కర్మయుక్తమైన భక్తివలన, లింగ దేహముతో బొందగల, స్వర్గాదిభోగములు గలుగునని నామనంబునకు దృఢమైనది. స్వామీ! ఇంక యోగమార్గ మెటువంటిదో సెలవీయవలయు?

యోగమార్గము

ఉత్త :- యోగము, అభ్యాస యోగమనియును, జ్ఞానయోగ మనియు, రెండు విధములుగాగలది.

ప్రశ్న:- అభ్యాస యోగ మనగా నెటువంటిది?

ఉత్త :- అభ్యాస యోగము మంత్రయోగ మనియు, లయయోగ మనియు, హఠయోగ మనియు మూడు మార్గములుగా గలది.

ప్రశ్న:- మంత్రయోగ మనగా నెటువంటిది?

ఉత్త :- ఏకాక్షర ద్వ్యక్షర షడాక్ష రాష్టాక్షరు - లనునవి యజపామంత్రములో నంతర్భూతములు, వీటిలో నేకాక్షరమయిన ప్రణవమే ముఖ్యమైనదియు, బ్రహ్మస్వరూపమును గనుక, ముముక్షువునకు నీ ప్రణవమే ముఖ్యముగా జపముచేయుదగినది. ఇదియే యతిరహస్యంబైన తారకం బనందగు, అజపమంత్రైక్య మధ్యంబైన బ్రహ్మావాచకంబు వహ్ని సూర్య చంద్ర రూపకంబైన మండల త్రయస్థానంబై యుండును. ప్రణవ తేజస్సు, వినా, తేజస్సులోకం బునలేదు. కనుక ప్రణవమే పరంజ్యోతిర్మయంబైన బ్రహ్మ స్వరూపంబు ప్రణవమే నాదబిందు కళాత్మికము. ఇట్టి ప్రణవ స్వరూపంబును దెలిసి కొంత తడవు జపంబు చేయవలయును. ఈ తెఱంగున ననాహతంబైన స్వరయుక్తముగా జిత్తంబున స్మరియించుచు, నంతట నుచ్ఛ్వాస నిశ్వాసంబుల గొంచపఱచుచు,

ప్రణవంబు చిత్తంబు నిల్పి తలంచుచు, ప్రణవార్థరూపంబైన మండలత్రయంబు నేకీభావంబైన తేజంబుగా భావింపుచు సహజంబుగా నుండుట. ఇందుకు సమ్మతము 'ఓంబ్రహ్మ' యను శ్రుతియు, 'ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ' యని భగవద్వాక్యము.

శ్లో॥ **సప్తకోటి మహామంత్రా చిత్త విభ్రమకారకాః ।**
ఏక ఏవపరో మంత్రం గురురిత్యక్షరద్వయ ॥

అని పరమశివుని వాక్యము.

ప్రశ్న :- లయ యోగమనగా నెటువంటిది?

ఉత్త :- ఈ లయయోగం బనర్గళ ప్రవాహమైనది గనుక వివరింపనశక్యము. అయినను ముఖ్య తాత్పర్యమేమనగా బంచవాయువులను బంధించి హంసను దళములకు నెక్కించి నిశ్శబ్దముగా నుండుట

ప్రశ్న :- హఠయోగ మనగా నెటువంటిది?

ఉత్త :- ఏలాగనిన, యమ నియమాదులగు నష్టాంగముల చేతనైనను గేవల కుంభకము చేత నైనను, దశవిధ వాయువులను, నింద్రియంబులను వశము చేసికొనుట.

ప్రశ్న :- అష్టాంగములనగా నెటువంటివి?

ఉత్త :- యమ, నియమ, ఆసన, ప్రాణయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులనియెడు నీయెనిమిది యష్టాంగము లనబడును.

ప్రశ్న :- యమ మనగా నెటువంటిది?

ఉత్త :- అహింసాపరులై బాహ్యేంద్రియ వృత్తులను వదిలి, విషయములను మానియుండుట.

ప్రశ్న :- నియమ మనగా నెట్టిది?

ఉత్త :- గృహస్థాశ్రమమును వదలి, యేకాంతముగా శుచి ప్రదేశమందైనను, మఠాంతరంబు నందైనను నివసించి

Scanned by TapScanner

క్షౌరాభ్యంజనంబులు మాని, యితర భాషణంబు లాకర్ణింపక, యోగాభ్యాసాసక్తి కలిగియుందుట.

ప్రశ్న :- ఆసన మనగా నెటువంటిది?

ఉత్త :- వ్యాఘ్రచర్మము, దర్భలు, కృష్ణాజినము మొదలయిన పరిశుద్ధ వస్తువుల చేత గల్పింపబడిన, యాసనము గలవాడై యరువది నాల్గు విధములయిన యాసనములందు నభ్యాసము కలవాడై వానిలో, నుత్తమమయిన సిద్ధాసనంబున గూర్చుండుట.

ప్రశ్న :- ప్రాణాయామ మనగా నెటువంటిది?

ఉత్త :- ఇడా మార్గంబున వాయువును బీల్చి, కుంభకంబున నిల్పి, పింగళ మార్గంబున వదలుటయును, మఱల బింగళమార్గంబున వాయువును బూరించి కుంభకంబున నిల్పి యిడా మార్గంబున రేచకంబు సేయుటయును, నిటుల సవ్యాప సవ్య మార్గంబుల యందు రేచక పూరకకుంభకము లొనర్చునట్టి సామర్థ్యము గల వాడై ప్రణవ స్మరణసేయుచు, పూరకంబు సేయునంతకు నిబ్బడిగా గుంభకంబున నిల్పి యష్టాంగుళములు పూరకంబును ద్వాదశాంగుళములు రేచకంబునగా బ్రాణయామంబు సేయుట.

ప్రశ్న :- ప్రత్యాహార మనగా నెటువంటిది?

ఉత్త :- షడ్రసముల భుజించుట మాని, వానిలో దియ్యని పదార్థంబైన శర్కర, పాలు, నెయ్యి, ఉదకము, అన్నము మొదలగునవి తగు మాత్రము భుజింపుచు, మత్తు గలుగనీక యహారనియమము గలిగి ప్రాణయామము సేయుచు వాయువును స్వాధీనము చేసికొనుట.

ప్రశ్న :- ధ్యాన మనగా నెటువంటిది?

ఉత్త :- మూలాధార-స్వాధిష్టాన-మణిపూరక-అనాహత-విశుద్ధ-ఆజ్ఞే యంబులను షట్చక్రములను, వాటి బీజాక్షర మంత్రములను వాటికి

Scanned by TapScanner

నధిదేవతలైన-గణేశ-బ్రహ్మ-విష్ణు- రుద్ర - జీవపరమాత్మకంబైన పృథ్వివ్యాప స్తేజోవాయు రాకాశా త్మకంబైన యాఱు తత్వంబులును, మణిపూరకంబుననుండు నగ్నిమండలమును, ననాహతంబున నుండు సూర్యమండలమును నాగ్నేయ ప్రదేశముననుండు చంద్రమండలమును, నివియన్నియు బ్రత్యేకముగా ధ్యానము సేయుట.

ప్రశ్న :- ధారణ యనగా నెటువంటిది?

ఉత్త :- షడాధారముల వలన వాయువును వశముగా జేసికొని, మూలాధారము మొదలుకొని యాఱుచక్రములను దాటి, యాచక్రముల యందుండెడి-అపాస-సమాన-ప్రాణ - ఉదాన - వ్యానములనెడి పంచవాయువులను నేకీభూతముగా ద్రికూట స్థానమందు జేర్చుకొని, పొగలేని మంటవలె జలింపక వెలింగెడి దీపంబు మాడ్కి బ్రజ్వరిల్లుచు, నా ప్రదేశమందు నేకాగ్ర చిత్తుడై నిష్ఠతో నుండుట.

ప్రశ్న :- సమాధి యనగా నెటువంటిది?

ఉత్త :- ధారణానిష్ఠ యందు నెంత తడవుండినను నంత వఱకు సమాధియనంబడును. ఈ సమాధియే రాజయోగమని చెప్పంబడును. ఈ రాజయోగమును సాధించుటకై యిరువదినాలుగు సంవత్సరములు పట్టును. ఇందుకై వాయుభక్షణ, జలభక్షణాది నియతాహారుడై జడను ధరియించి నారచీరలు గట్టి భూశయ్యగల వాడై శరీరమును మిక్కిలి క్షీణింప జేసి, యధి కాయాసమును జెందినప్పటికిని నీ యోగము వలన నణిమాది సిద్ధులును సాష్టిత్వ సంపదయు గలుగునేకాని విదేహకైవల్యము ప్రాప్తించదు. ఇందుకు సమ్మతము.

శ్లో॥ యోగినోరాగిణశ్చైవ భోగినస్త్యాగిన స్తథా ।
బ్రహ్మజ్ఞానం వినామోక్షః ఇతి వేదాంత డిణ్డిమః॥ అని యున్నది.
తురీయ యోగమందు సప్తాంగములు వేఱువిధముగా నున్నవి.

ప్రశ్న :- స్వామి! అవి యెవ్వియో వినగోరెద?

ఉత్త :- తురీయ యోగ మందు-యమము-అనగా - ఆహారనిద్రేంద్రియా విజయంబులును నిశ్చల శాంతియుం గలిగినదే యమంబు.

ప్రశ్న :- నియమనగా నెద్ది?

ఉత్త :- వికల్పదోషరహితంబై, యసంశయంబను గురు భక్తియు, యథేచ్ఛాలాభసంతుష్టియు, విరక్తి భావంబును, గరణనిగ్రహంబును గలిగినదే నియమంబనంబడు.

ప్రశ్న :- ఆసనం బనగా నెట్టిది?

ఉత్త :- సర్వోదాసీన (సర్వస్థలముల యందును గూర్చుండి) మనం బాత్మయం దాసన్నం బగుటయే యాసనం బనదగు.

ప్రశ్న :- ప్రాణాయామం బనగా నెద్ది?

ఉత్త :- రేచక పూరక సూచకంబై యుభయవిరహితంబైన, యావిరుద్ధ కేవల కుంభకంబున బ్రాణంబు దీరంబు జేర్చి జగంబు మిథ్యయని తలంచుటయే ప్రాణయామము.

ప్రశ్న :- ప్రత్యాహారం బనగా నెయ్యది?

ఉత్త :- అమలంబై యంతర్ముఖంబైన మనంబు బహిర్విషయ సంగంబుమాని, యాత్మప్రత్యయంబు లుపసంహృతంబు లగుటవలన, మనంబు విక్షేపశూన్యంబై నిర్వ్యాపారంబుగా నిలుచుటయే ప్రత్యాహారం బనంబడును.

ప్రశ్న :- ధ్యానం బనగా నెద్ది?

ఉత్త :- అద్వయంబైన, యాత్మానుభవంబున సర్వంబు నాత్మగా నెఱుగుచు సకల భూతసమత్వంబును, నిత్యతృప్తియు గలుగుటయే ధ్యానంబు.

ప్రశ్న :- ధారణ యనగా నెట్టిది?

ఉత్త :- బాహ్యాభ్యంతరములయందు నేకంబుగా స్వతేజోమయంబని పరతత్వంబు గాంచి, తదీయధారణ గాంచుటే ధారణయ నంబడును.

ప్రశ్న :- సమాధి యనగా నెయ్యది?

ఉత్త :- నిర్వికారుడై నిందాస్తుతుల నొక్క చందంబున వినుటయు శీతోష్టముల నొక్కగతి స్పృశించుటయు, సుందరీజనంబులను నిర్జీవములైన పాడెకట్టెలను నిర్వికారుడై యొకరీతిగా జూచుటయు, షడ్రసముల నొక్క పగిదిజవిగొనుటయు. సుగంధ దుర్గంధముల నొక్క మాడ్కి గ్రహించుటయు, ద్వంధ్వనిర్ముక్తమైన నిశ్చలై శాంతభావము సిద్ధించుటయు మహనీయుమగు సమాధి యనంబడు మఱియు వృత్తి యేకాగ్రమగుచు నెఱుగుట కేమియులేక, భావాభావ శూన్యమై యెద్ది నిండియున్నదో, యదియే యమనస్క నిర్వికల్ప సమాధియనంబడు.

ప్రశ్న :- ఈ యోగములు సాధించుటకు నింకయు నితరములైన సాధనమును గలవా?

ఉత్త :- నాదానంద ప్రభావము వలనను, బంచముద్రల ననుభవము వలనను నవి సాధింపవచ్చును.

ప్రశ్న :- నాదానంద ప్రభావమనగా నెటువంటిది?

ఉత్త :- నాదానందము రెండు విధములు గలది. ఆనందమనియును, గేవలాందమనియును జెప్పంబడును. ఆనందమార్గమును వినుము. సద్గురు కటాక్షంబున నాదబిందుకళల నెఱింగి, యంగుళ ద్వయంబున గర్ణరంధ్ర ద్వయంబును మూసి, దశవిధ నాదముల వినుటయే యానందము. కేవలానందమార్గమును వినుము.

సద్గురు ముఖంబున నాదబిందు కళల నెఱింగి హంస సంచారస్రోవలను గనిపెట్టియా యిడాపింగళ నాడులయందు హంసను సంచరింపజేయుచు జిఱ్ఱున రేచించి సూర్యుని జంద్రనాడియందును, జంద్రుని సూర్యనాడియందును గతులు తప్పించి నడిపించుచు జంద్ర భాస్కరులను జీకాకుపఱచి, సర్పమునకుగాక పుట్టించి దశవిధ నాదములను బయటదీసి శ్రోత్రములను మూయకయే సదా వినిపించుట, బ్రహ్మానందమని యును, గేవలానందమనియును జెప్పబడును. ఈ మార్గముచేత నహంకార మమకారంబులును, గామాది శత్రువర్గంబును నశించును. నాదముల వివరము - జలధి ఘోషానాదంబు, చిణీనాదంబు, భేరీనాదంబు, మృదంగనాదంబు, కాహళనాదంబు, వేణునాదంబు, భ్రమరనాదంబు, తాళనాదంబు, శంఖానాదంబు, ఘంటానాదంబు ఇవి దశవిధ నాదంబులు.

ప్రశ్న :- పంచముద్ర లనగా నెటువంటిది?

ఉత్త :- భూచరియనియు, ఖేచరియనియు, మధ్యమయనియు, షణ్ముఖయనియు, శాంభవియనియు - నయిదు విధములు.

ప్రశ్న :- భూచరి యనగా నెటువంటిది?

ఉత్త :- గురువు వలన బంచాక్షరీ మంత్రమును, నామంత్రార్థములను దెలిసికొని, యాసనాధిష్ఠుండై నేత్రములను దెఱచి నాసిక కొనయందు దృష్టినిల్పి చూచిన నదియే భూచరీముద్ర యనంబడును.

ప్రశ్న :- ఖేచరి యనగా నెటువంటిది?

ఉత్త :- గురువు వలన బంచాక్షరీ మంత్రమును, నామంత్ర మూలమును. నామంత్రార్థమును, నామంత్రాధి దేవతలైన పరశివాలోకనమును

Scanned by TapScanner

దెలిసికొని, పద్మాసనమందు గూర్చుండి నడుమునిక్కి ముఖమెత్తి నేత్రముల మూసికొని, త్రికూట స్థానమందు దృష్టి నిలిపిన నది యంత:ఖేచరియనియు, నేత్రముల దెఱచి యీ విధముగానే చూచినట్టయిన బహి:ఖేచరి యనియు జెప్పంబడును.

ప్రశ్న :- మధ్యమ ముద్ర యనగా నెటువంటిది?

ఉత్త :- సద్గురూక్త ప్రకారము కూర్చుండి యర్థోన్మీలిత లోచనుండై, నాసిక మధ్య భాగమందు దృష్ట నిల్పి నిటలమును జూచినట్టయిన నది మధ్యమ ముద్రయని చెప్పబడును.

ప్రశ్న :- షణ్ముఖి యనగా నెటువంటిది?

ఉత్త :- సద్గురూక్త ప్రకారము నియమముతో గూర్చుండి శ్రవణద్వయంబును, నేత్రద్వయంబును, నాసికాద్వయంబును, షడంగుళములతో మూసి, త్రివేణి సంగమంబున దృష్టినిల్పి చూచి యానందించుట యేదిగలదో, యదియే షణ్ముఖి యనబడును.

ప్రశ్న :- శాంభవీ ముద్ర యనగా నెటువంటిది?

ఉత్త :- ఎడమ కాలి మడిమను గుదస్థానమునందు జేర్చి, కుడి కాలి మడిమను దొడపిక్క సందులో నుంచుకొని, తొడలయందు జేతుల బూన్చుకొని, నడుమును జక్కగానిక్కి, ప్రాణాపానములను నొకటిగా జేర్చి, హంసను ద్రికూటస్థానమందు జిక్కబట్టి చూచి యానందించుటయే శాంభవీ ముద్ర యనంబడును.

ప్రశ్న :- అయితే నీయోగ ముద్రలను సాధించినందున ఫలమేమి?

ఉత్త :- ఇంత ప్రయాస జెంది యీ యోగములను సాధించినందున జంచల యుక్తమయిన మనస్సును నిశ్చల పఱచుటకును, గుఱ్ఱములవలె బరుగెత్తెడు నింద్రియములను స్వాధీన పఱచుకొనుటకును సాధనమయ్యెను. అవి యెటువలెననిన॥ నాగస్వరము

పాడి పామును బట్టినట్టును, మచ్చులు వేసి పక్షులను బట్టినట్టును, మాంసము కనపఱచి డేగను బట్టినట్టును, నెఱ్ఱను గనుపరచి చేపను బట్టినట్టును, మనస్సును నింద్రియములను జయించుటకు దగిన సాధనములేగాని మోక్ష ప్రదములుగావు. ఇట్టి యోగము సాధించుకొఱకై వాయుభక్షణ, జలభక్షణాది నియతాహారుడై జడలు ధరియించి, నారచీరలు గట్టి భూశయ్య గలవాడై శరీరమును మిక్కిలి క్షీణింపజేసి, యధికాయాసము జెంది సాధించినప్పటికి నీ యోగము వలన నణిమాది సిద్ధులును సాక్షిత్వ పదవియును గలుగునుగాని, విదేహకైవల్యము ప్రాప్తించదు. ఇందుకు సమ్మతం॥

శ్లో॥ యోగినో రాగిణశ్చైన భోగినస్త్యాగిన స్తథా బ్రహ్మజ్ఞానం
వినా మోక్షం ఇతి వేదాంత డిణ్డిమః ॥ అని యున్నది.

ప్రశ్న :- అయితే, స్వామి! ఇంత శ్రమజెంది యోగాదు లభ్యసించినందున లోకరంజకమైన, యణిమాది సిద్ధులును, బునర్జన్మరాహిత్యములు గాని, సాక్షిత్వ పదవి యే - ప్రాప్తించునని సెలవిచ్చితిరి గదా వానివలన నేమి ప్రయోజనము? కనుక జన్మరాహిత్య కారియైన జ్ఞానమార్గము నుపదేశించి కృతార్థునిగా జేయవలయును. అని ప్రార్థించగా సద్గురుండానతిచ్చుచున్నాడు?

ఉత్త :- బిడ్డా! జ్ఞానము లభించుటకుగాను నాత్మానాత్మ విచారణ చేయవలయును.

జ్ఞానమార్గము

ప్రశ్న :- స్వామి! ఆత్మానాత్మ విచారణ సేయవలయునని యాజ్ఞయిచ్చి తిరిగదా? దానిని బోధించి నన్ను గృతార్థునిగా జేయగోరెదను?

ఉత్త :- బిడ్డా! ఆత్మానాత్మ విచారణ సేయుటకు సాధన చతుష్టయ సంపత్తి కలవాడె యధికారి.

Scanned by TapScanner

ప్రశ్న :- సాధన చతుష్టయ సంపత్తి యనగా నెటువంటిది?

ఉత్త :- నిత్యానిత్య వస్తువు వివేకము, ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము. శమాదిషట్కమ సంపత్తి, ముముక్షుత్వము అనునవి.

ప్రశ్న :- నిత్యానిత్య వస్తువు వివేకమనగా నెటువంటిది?

ఉత్త :- బ్రహ్మము సత్యమనియు, నామరూపాత్మికమైన యీప్రపంచ మసత్యమనియు సద్గురువు వలనం దెలిసికొనుటయే నిత్యానిత్య వస్తు వివేకము.

ప్రశ్న :- ఇహాముత్రార్థ ఫలభోగ విరాగమనగా నెటువంటిది?

ఉత్త :- ఈ ప్రపంచమందు వనితాది భోగములతో గూడుకొని గృహ కుటుంబ ధనధాన్య వస్తువుల యందును, స్వర్గ లోకమందలి యనిత్యములైన రంభాసంభోగాదుల యందును, గోరికలు లేక వమనమైన యన్నమునందు, మూత్రపురీషాదులయందును, నెటుల నిష్టము గలుగదో యటువలెనే కోరికలు లేక యుండుట.

ప్రశ్న :- శమాదిషట్కమ సంపత్తి యనగా నెటువంటిది?

ఉత్త :- శమమనియు, దమమనియు, నుపరతియనియు, దితీక్షయనియు, సమాధానమనియు, శ్రద్ధయనియు, నాఱువిధములుగా గలది.

ప్రశ్న :- శమ మనగా నెటువంటిది?

ఉత్త :- మనస్సు వేదాంత శ్రవణ వ్యతిరిక్తమైన విషయాదుల యందు బోవుచుండినను నట్టి మనస్సును వానినుండి మరలించి వేదాంత శ్రవణాదుల యందు నిలుపుటయే శమమని చెప్పంబడును.

ప్రశ్న :- దమ మనగా నెటువంటిది?

ఉత్త :- జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు, వేదాంతశ్రవణ వ్యతిరిక్తమైన విషయాదులకుంబోవుచుండిన వానిని మరలించి, శ్రవణాదులయందు నిలుపుటయే దమమని చెప్పంబడును.

ప్రశ్న :- ఉపరతి యనగా నెటువంటిది?

ఉత్త :- సకల పాపకర్మములను మాని సకల పుణ్యకర్మములను గర్తృత్వాభిమాన ఫలకాంక్షిగాక, యీశ్వరార్పణ సేయుటయే యుపరతి యనంబడును.

ప్రశ్న :- తితీక్ష యనగా నెటువంటిది?

ఉత్త :- ప్రారబ్ధము చేత నేకాలమునకు నేమి సంభవించునో యది యనుభవింపక తీఱదని నిశ్చయించుకొని, సమస్తము పోయినప్పుడు వ్యసనమును, సకలము వచ్చినప్పుడు సంతోషమును లేక, సమబుద్ధితో నుండుటయే తితీక్ష యనంబడును.

ప్రశ్న :- సమాధాన మనగా నెటువంటిది?

ఉత్త :- పెద్దల వద్ద జేరి వేదాంత శ్రవణము చేయు కాలంబున మనసును నింద్రియములను, బూర్వవాసనల చేత వేదాంత శ్రవణ వ్యతిరిక్తములయిన విషయాదులకు బోవుచుండిన వానిం ద్రిప్పి వేదాంత శ్రవణమందు నిలుపుటయే సమాధానము.

ప్రశ్న :- శ్రద్ధ యనగా నెటువంటిది?

ఉత్త :- వేదాంత వాక్యములయందును, నాచార్య స్వాముల వారి యందును, నీశ్వరుని యందును, నధిక విశ్వాసముతో గూడి యుండు శ్రద్ధ యనంబడును.

ప్రశ్న :- ముముక్షత్వమనగా నెటువంటిది?

ఉత్త :- మోక్షము దెలుసుకొని, దానిని బొందవలెనను మనస్సుతో గూడుకొనియుండుటే మోక్షేచ్ఛ యనంబడును.

ప్రశ్న :- మోక్షేచ్ఛ యెన్ని విధములు?

ఉత్త :- మంద మోక్షేచ్ఛ యనియును దీవ్రమోక్షేచ్ఛ యనియును రెండు విధములు గాగలవు.

Scanned by TapScanner

ప్రశ్న :- మంద మోక్షేచ్ఛ యనగా నెటువంటిది?

ఉత్త :- మోక్షమునకు గావలసిన సాధనములను సంపాదించకయే, మోక్షము కావలెనని కోరుటే మందమోక్షేచ్ఛ.

ప్రశ్న :- తీవ్రమోక్షేచ్ఛ యనగా నెటువంటిది?

ఉత్త :- ఇల్లు చుట్టును కాలునట్టి సమయమున నింటనుండు వాడు వెళ్ళిపోవలెనని ప్రయత్నము చేసినట్టును, నడవిలో ద్రోవదప్పిన వాడు మార్గమును గనుగొనవలయునని ప్రయత్నము చేసినట్టును, బెద్దపులి తఱిమినప్పుడు దానిచేత గఱవబడక తప్పించుకొన వలయునని ప్రయత్నము చేసినట్టును, మార్గములో గృష్ణసర్పము కఱవవచ్చిన దానిని దప్పించుకొనవలయునని ప్రయత్నము చేసినట్టును, దొంగలు తరుముక వచ్చిన యెడల తన ధనమువారికి జిక్కకుందునట్లు ప్రయత్నము చేసినట్టును, దీవ్రమోక్షేచ్ఛగల వాడతి తీవ్ర మనస్సుతో మోక్షసాధనల: ద్వరలో సంపాదించును లోకమందు బైజెప్పబడ్డ యుపద్రవములన్నియును నొకటొకటిగా లోకులకు సంప్రాప్తించునే గాని, దీవ్రమోక్షేచ్ఛ గలవానికి మాత్రమిట్టి యుపద్రవములన్నియు నేక కాలమందే సంభవించును.

ప్రశ్న :- ఈ యుపద్రవము లన్నియు దీవ్రమోక్షేచ్ఛ గలవానికి నేకకాలమం దేతీరుగా సంభవించును?

ఉత్త :- ఇల్లు కాలుట యనగా దేహమనెడు నిల్లు తాపత్రయములను నగ్ని తగిలి తపించుటయే యిల్లు కాలుట. అడవిలో ద్రోవ తప్పుట యనగా - నాత్మస్వరూపము తానని తెలియక, దేహేంద్రియాదులు నేనని యనుకొనుటయే - దారితప్పుట. పెద్దపులి తరుముక వచ్చుటయనగా - దుర్విషయములను సంకల్పించు మనస్సే పులి కఱవ వచ్చుట, కృష్ణసర్పము కఱవ వచ్చుట యనగా -

Scanned by TapScanner

విషయములయం దత్యాశతో గూడియుండుటే - సర్పము కలవ వచ్చుట దొంగలు తఱుముక వచ్చుటయనగా - నరిషడ్వర్గమను చోరులు తన వివేక మను ధనము నపహరింప వలయునని యుండుటయే - దొంగలు తఱుముక వచ్చుట. ఇట్లుపద్రవ ములన్నియు నేకకాలమందు సంభవించగా నీ యుపద్రవములను బోగొట్టెడు సద్గురు డెచ్చటనున్నాడో యిందు కేమేమి సాధనములు కావలయునో యని చింతించెడు వాని మనోవ్యాపారమునకు దీవ్రమోక్షేచ్ఛ యని పేరు. ఈ నాలుగు సాధనములు కలవాడై యాత్మానాత్మ విచారణకు నధికారిగాని, యన్యుడుకాడు.

ప్రశ్న :- అయిన నాత్మానాత్మ విచారణ సేయుటకు సాధన చతుష్టయములో నిత్యానిత్య వస్తువివేకము మాత్రమే చాలునా? లేక నాల్గు సాధనములు కావలెనా?

ఉత్త :- ఒకసాధన చాలదు, నాలుగు సాధనములు కావలెను. ఎందువలన ననగా నీలోకమునందు శాస్త్రవేత్తలు నిత్యానిత్య వస్తు వివేకము గలవారై యుండియు, జననమరణ హేతువులైన కామ్యకర్మము లాచరించుచు, విషయా సక్తులయి యుందురుగాన, వారలకు నధికారము చాలదు.

ప్రశ్న :- అయిన - నధికారికి రెండు సాధనములుండిన జాలునా?

ఉత్త :- చాలవు - ఎందువలననగా - కొందఱు ఋషీశ్వరులు రెండు సాధనములు గలవారై యుండియు గోపాతాపాధికులై యితరులను శపించుచు, శమము లేనందున వారికి నధికారము చాలదు.

ప్రశ్న :- అయిన మూడు సాధనములుండిన జాలునా?

ఉత్త :- చాలదు, ఎలాగనిన - లోకమునందు గొందఱు సంసారమును వదలి జడలు ధరియించి కృష్ణాజినంబులం బూని, మిక్కిలి

శాంతులై యొకరిని యాచించక యోగులను నామమును వహించిన పెద్దలు, నిత్యానిత్య వస్తు వివేకమును, నిహమూత్రార్థ ఫలభోగవిరాగమును, శమాదిషట్కమ సంపత్తియును, నీ మూడు సాధనములు గలవారలై యుండియును, వేదాంత శ్రవణ ప్రదేశమందు నిలువరు గనుక, వారికిని నధికారము జాలదు. కాబట్టి నాల్గు సాధనములు కలవారే యధికారులు. ఈసాధన చతుష్టయములు శరీరముల వలనను, వాక్కువలనను నాచరింప దగినవికావు. అవి మనోవ్యాపారములు గనుక విషయాసక్తి లేనివారికి సులభముగా సిద్ధించును.

ప్రశ్న :- శ్రవణమునకు ముందు సాధన చతుష్టయము లేనివారికి నేమి గతి కలుగును?

ఉత్త :- శ్రవణ కాలమందైనను గురువుల వలన సాధన చతుష్టయ సంపత్తితో గూడ బొందవలయును. అట్లు పొందనివారికి నధికారము చాలదు.

ప్రశ్న :- తాపత్రయము లనగా నెటువంటివి?

ఉత్త :- ఆధ్యాత్మిక మనియు, ఆధిభౌతిక మనియు, ఆదిదైవిక మనియు, మూడు విధములగా గలవు.

ప్రశ్న :- ఆధ్యాత్మిక తాపమనగా నెటువంటిది?

ఉత్త :- ఆత్మను నధిష్టించుకొనివచ్చు చెవిపోటు, కండ్లకలక, శీతజ్వరాదులు మొదలయిన యుపద్రవములకు నధ్యాత్మికమని పేరు.

ప్రశ్న :- ఆధిభౌతిక మనగా నెటువంటిది?

ఉత్త :- ఇతర భూతముల వలన ననగా దొంగల వలనను, గ్రూరజంతువుల వలన ననగా బులి మొదలయినవాని వలనను బాములవలనను దేళ్లవలనను వచ్చేడు నుపద్రవములకు నధిభౌతిక తాపమని పేరు.

Scanned by TapScanner

ప్రశ్న :- అధిదైవిక తాపమనగా నెటువంటిది?

ఉత్త :- అధిదేవతలైన సూర్య, వాయు, వర్ష, అగ్ని మొదలగు వానివలన ననగా వర్షము వలన, వాయువువలన, బిడుగుల వలన నెండల వలన వచ్చు నుపద్రవములకు నధి దైవిక తాపమని పేరు.

ప్రశ్న :- అరిషడ్వర్గములనగా నెటువంటివి?

ఉత్త :- కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములని యాఱు విధములుగా గలవు.

ప్రశ్న :- కామ మనగా నెటువంటిది?

ఉత్త :- గృహ, రామ, క్షేత్ర, ధన, ధాన్యములు, మిక్కిలిగా సంపాదించ వలెనను, మనోవ్యాపారమునకు గామ మనబడును.

ప్రశ్న :- క్రోధ మనగా నెటువంటిది?

ఉత్త :- స్వార్జిత ధనాపహరణ మెవరిచేత జేయబడునో వారి యందా గ్రహము గలిగెడి, మనోవ్యాపారమునకు గ్రోధమని పేరు.

ప్రశ్న :- లోభ మనగా నెట్టిది?

ఉత్త :- తాను సంపాదించిన ధనములో నొక కాసైనను, నితరులకు నియ్యన నెడు మనోవ్యాపారమునకు లోభమని పేరు.

ప్రశ్న :- మోహమనగా నెటువంటిది?

ఉత్త :- స్వార్జిత వస్తువాహనాలను మిక్కిలి ప్రేమచేత బొరపాటు లేక కాపాడునట్టి మనోవ్యాపారమునకు మోహమనబడును.

ప్రశ్న :- మద మనగా నెటువంటిది?

ఉత్త :- సకల సంపదల వలన గర్వించి మంచి చెడులు తెలియక యుండెడి, మనోవ్యాపారము మద మనబడును.

ప్రశ్న :- మాత్సర్య మనగా నెటువంటిది?

ఉత్త :- ఇతరులు తనకంటె గొప్పగా నుండిన యెడల వారిని జూచి సహించలేని, మనోవ్యాపారమును మాత్సర్యమని చెప్పబడును.

ప్రశ్న :- స్వామి! ఆత్మానాత్మ విచారణ సేయవలయునని సెలవిచ్చితిరి గదా! ఆత్మ యనగా నెట్టిది? అనాత్మ యనగా నెట్టిది?

ఉత్త :- ఆత్మ యనగా: శరీర త్రయ విలక్షణుడు, అవస్థాత్రయ సాక్షి, పంచకోశవ్యతిరిక్తుడు, పంచవింశతి తత్వాతీతుడు, సచ్చిదానంద స్వరూపుడు, నిత్యుడు, సత్యుడు, నిర్వికారుడు, నిర్వికల్పుడు, నిర్గుణుడు, శుద్ధుడు, నిత్యముక్తుడునైన వాని నాత్మయని చెప్పబడును.

ప్రశ్న :- స్వామి! శరీరత్రయ మనగా నెటువంటిది?

ఉత్త :- శిష్యా! స్థూలమనియును, సూక్ష్మమనియును, గారణమనియును మూడు విధములుగా జెప్పబడినవి.

ప్రశ్న :- స్థూల శరీరమనగా నెటువంటిది?

ఉత్త :- త్వక్కు, చర్మ, మాంస, రుధిర, మేధ, మజ్జ, అస్థి అను సప్తధాతువులతో గూడియుండినదియును. మాతాపితృల యొక్క శుక్ల శోణితముల వలన బుట్టినదియును, గరచరణాద్యవయ వములతో గూడుకొని స్తంభమువలె గనబడుచు నుండునదే స్థూల శరీరము. ఇది పంచవిశంతి తత్వములతో గూడినది.

ప్రశ్న :- అయితే - స్థూల శరీరము, శుక్ల శోణితముల వలన బుట్టినదని చెప్పితిరి గదా; ఆ శుక్ల శోణితములు దేని వలన బుట్టినవి?

ఉత్త :- శిష్యా ! అన్నము వలనం బుట్టినవి.

ప్రశ్న :- స్వామి! అన్నము దేనివలన బుట్టినది?

ఉత్త :- ఓషధుల వలనం బుట్టినది.

ప్రశ్న :- ఓషధులు దేనివలన బుట్టినవి?

ఉత్త :- పృథ్వి వలనం బుట్టినవి.

ప్రశ్న :- పృథ్వి దేనివలనం బుట్టినది?

ఉత్త :- జలమునందలి గంధతన్మాత్రల వలనం బుట్టినది.

Scanned by TapScanner

ప్రశ్న :- జలము దేనివలన బుట్టినది?

ఉత్త :- అగ్నియందలి రసతన్మాత్రల వలనం బుట్టినది.

ప్రశ్న :- అగ్ని దేని వలన బుట్టినది?

ఉత్త :- వాయువు నందలి రూప తన్మాత్రల వలన బుట్టినది.

ప్రశ్న :- వాయువు దేనివలన బుట్టినది?

ఉత్త :- ఆకాశము నందలి స్వర్శతన్మాత్రల వలనం బుట్టినది.

ప్రశ్న :- ఆకాశ మెట్లు పుట్టినది?

ఉత్త :- శబ్దంబు వలనం పుట్టినది.

ప్రశ్న :- శబ్ద మెట్లు పుట్టినది?

ఉత్త :- ఓంకారము వలనం బుట్టినది. అట్టి ఓంకారము వలన అకార, ఉకార, మకారములను, మూడు మాతృకలు గలిగినవి. వానిలో అకార మాతృక వలన రజోగుణ యుక్తుడైన బ్రహ్మ పుట్టి సకల సృష్టికి గారకుడాయెను. ఉకార మాతృక వలన సత్వగుణ యుక్తుడైన విష్ణువు పుట్టి సర్వపోషక కర్తయయ్యెను. మకార మాతృక వలన దమోయుక్తుడైన శివుడు పుట్టి సర్వవిలయ కర్తయయ్యెను.

ప్రశ్న :- అయితే అట్టి ఓంకార మెట్లు పుట్టెను?

ఉత్త :- మాయాశ బలిత బ్రహ్మ వలన పుట్టినది.

ప్రశ్న :- మాయాశ బలిత బ్రహ్మ యెట్లు గలిగెను?

ఉత్త :- సత్వగుణ ప్రధానమైన మాయయందు, నిజాంశమైన యీశ్వరుడు ప్రతిఫలించినందున, మాయాశ బలిత బ్రహ్మమయ్యెను.

ప్రశ్న :- సత్వగుణ ప్రధానమయిన మాయ యెటుల బుట్టినది?

ఉత్త :- అహంకారంబు వలన ద్రిగుణాత్మకంబై కలిగెను.

ప్రశ్న :- అహంకారం బెటుల పుట్టినది?

ఉత్త :- మహత్తత్వము వలనం బుట్టినది.

ప్రశ్న :- మహత్తత్వ మెటుల బుట్టినది?

ఉత్త :- మూల ప్రకృతి వలనం బుట్టినది.

ప్రశ్న :- మూల ప్రకృతి యెటుల బుట్టినది?

ఉత్త :- అనాదినిర్వికల్ప పరబ్రహ్మమునందు లీనమైయున్నది – ఏలాగనిన – దీపము క్రింద నీడవలెనే యున్నది. గనుక నీ విధముగా బంచ భూతాత్మికమై, పంచవింశతి తత్వములతో గూడికొనియున్నదే – స్థూలశరీరము.

ప్రశ్న :- స్థూల శరీరము పంచవింశతి తత్వములతో గూడినదని చెప్పితిరి గదా! పంచవింశతి తత్వములనగా నెటువంటివి?

ఉత్త :- శ్రోత, త్వక్, చక్షు, జిహ్వా, ఘ్రాణములను జ్ఞానేంద్రియములయిదును; వాక్పాణి పాద పాయూపస్థల నెదు కర్మేంద్రియంబులైదును; జ్ఞాత మనోబుద్ధి చిత్తా హంకారంబులనియెదు నంతరింద్రియంబులైదును; శబ్ద స్పర్శ రూపరస గంధంబులనియెదు విషయేంద్రియంబులైదును; బ్రాణా పాన వ్యానో దాన సమానముల నెదు, ప్రాణేంద్రియంబులైదును గూడి, పంచవిశంతి తత్వంబులయ్యె.

ప్రశ్న :- సూక్ష్మదేహ మనగా నెటువంటిది?

ఉత్త :- జ్ఞానేంద్రియంబులైదు, గర్మేంద్రియంబులైదు, బ్రాణములైదు, మనస్సు చిత్తముగూడి యొకటిన్ని, బుద్ధి యహంకారము గూడి యొకటియు, మనోబుద్ధులను రెంటితో గూడి పదియేదు తత్వములతో గూడిన దే–సూక్ష్మ శరీరము, దీని కేలింగ శరీరమని పేరు.

ప్రశ్న :- కారణ శరీరమనగా నెటువంటిది?

ఉత్త :- మలినసత్వ రజస్తమో గుణాత్మికమైన, యవిద్యయే కారణ శరీరము. సంకల్ప వికల్పాత్మకమైన చిత్తము, నిర్మలమైన జ్ఞానముతో గూడినదె – కారణ దేహము.

ప్రశ్న :- అవస్థాత్రయ మనగా నెటువంటిది?

ఉత్త :- జాగ్రదవస్థయనియు, స్వప్నావస్థయనియు, సుషుప్త్యవస్థయనియు మూడు విధములుగా గలవి.

ప్రశ్న :- జాగ్రదవస్థయనగా నెటువంటిది?

ఉత్త :- ఇంద్రియంబుల చేత వెలుపల నుండు వస్తువులను గుర్తెఱుగుటయే జాగ్రదవస్థ. దీనికి - అభిమాని - విశ్వుడు.

ప్రశ్న :- స్వప్నావస్థయనగా నెటువంటిది?

ఉత్త :- జాగ్రదావస్థయందు ననుభవించిన పదార్థములను అనుభవించని పదార్థములను మనస్సు విషయాకారముగా బరిణమించి యెంత పర్యంతము గుర్తెఱుగుచున్నదో యంతపర్యంతము స్వప్నావస్థయ నంబడును. దీనికి - అభిమాని - తైజసుడు.

ప్రశ్న :- సుషుప్త్య వస్థయనగా నెటువంటిది?

ఉత్త :- ఇంద్రియములను మనస్సును బుద్ధిలో లీనమయియుండగా, బుద్ధి కారణాద్యాకారముగా నెంత పర్యంత ముండునో,యంత పర్యంతము సుషుప్త్యవస్థ యనంబడును. దీనికి - అభిమాని - ప్రాజ్ఞుడు.

ప్రశ్న :- పంచకోశములనగా నెటువంటివి?

ఉత్త :- అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమ యములని యయిదు విధములు.

ప్రశ్న :- అన్నమయ కోశ ధ్యాన మనగా నెటువంటిది?

ఉత్త :- సప్తధాతువులలో గూడినదై, కరచరణాద్యవయవములతో స్తంభమువలె గనుపడు స్థూల దేహమే - యన్న మయకోశ మనంబడును.

ప్రశ్న :- ప్రాణమయకోశ మనగా నెటువంటిది?

ఉత్త :- ప్రాణము లైదును, గర్మేంద్రియము లైదును, గూడుకొని యుండునదే ప్రాణమయకోశము.

Scanned by TapScanner

ప్రశ్న :- మనోమయ కోశమనగా నెటువంటిది?

ఉత్త :- జ్ఞానేంద్రియములైదును, మనస్సును గూడినదే మనోమయకోశము.

ప్రశ్న :- విజ్ఞానమయ కోశమనగా నెటువంటిది?

ఉత్త :- జ్ఞానేంద్రియములైదును, బుద్ధిని గూడినదే విజ్ఞానయమకోశము,

ప్రశ్న :- ఆనందమయకోశమనగా నెటువంటిది?

ఉత్త :- మలిన సత్వరజస్తమో గుణాత్మకమైన యవిద్యయే యానంద మయకోశము.

ప్రశ్న :- వీనికి గోశములని పేరెందుకు వచ్చినది?

ఉత్త :- ఆత్మను నెఱుగ నీయక, కోశముల వలె గప్పబడుచున్నవి. గనుక కోశములని పేరు వచ్చినది. అదియేలాగనిన జింతపండునకుమీద గుల్ల కప్పుకొనియున్నట్టు లాత్మను గోశములు గప్పియుండును.

ప్రశ్న :- అయితే శరీర త్రయమునకును, గోశములకును, నేర్పాటులు గలవా?

ఉత్త :- శరీర త్రయమే పంచకోవములై యున్నవి. ఎట్లనిన స్థూలశరీరమే యన్నమయకోశము, కారణ శరీరమే యానంద మయకోశము, సూక్ష్మశరీరమే - ప్రాణమయ, మనోమయ,విజ్ఞానమయ కోశములైయున్నవి గాని, శరీరములు వేఱుగాను, గోశములు వేఱుగాను నుండలేదు.

ప్రశ్న :- చతుర్విశంతి తత్వములనగా నెటువంటివి?

ఉత్త :- జ్ఞానేంద్రియములైదును, గర్మేంద్రియము లైదును, బ్రాణములైదును, విషయాదులైదును, నంతఃకరణ చతుష్టయమును గూడి, చతుర్వింశతి తత్వము లనబడును.

ప్రశ్న :- సచ్చిదానంద స్వరూపుడనగా నెటువంటివాడు?

ఉత్త :- సత్తు, చిత్తు, ఆనందము - అనెడి మూడు లక్షణములు గలవాడు.

ప్రశ్న :- సత్స్వరూపుండనగా నెటువంటివాడు?

ఉత్త :- ఏ వస్తువు చేతను బాధింపబడక, భూత భవిష్య ద్వర్తమాన కాలముల యందు, నేకరూపముగా నున్నవాడు.

ప్రశ్న :- చిత్స్వరూపుండనగా నెటువంటివాడు?

ఉత్త :- తనకు దానే ప్రకాశించెడువాడు.

ప్రశ్న :- ఆనందస్వరూపుడనగా నెటువంటివాడు?

ఉత్త :- దేహేంద్రియాదులు నేను గానని, పరిపూర్ణముగాను దెలివిగాను నుండు నాత్మస్వరూపము నేనని తెలుసుకొనెడువాడు.

ప్రశ్న :- నిత్యుండనగా నెటువంటివాడు?

ఉత్త :- నాశనరహితుడు గనుక నిత్యుడు.

ప్రశ్న :- సత్యుడనగా నెటువంటివాడు?

ఉత్త :- అసత్యమైన ప్రపంచము, కాలత్రయములయందు గానివాడు.

ప్రశ్న :- నిర్వికారుడనగా నెటువంటివాడు?

ఉత్త :- షోడశవికార స్వరూపుడైన, సూక్ష్మశరీరము లేనివాడు గనుక నిర్వికారుడని చెప్పబడును.

ప్రశ్న :- నిర్వికల్పుడనగా నెటువంటివాడు?

ఉత్త :- మనస్సు లేదు గనుక, సంకల్పవికల్పములు లేనివాడు.

ప్రశ్న :- నిర్గుణుండనగా నెటువంటివాడు?

ఉత్త :- బుద్ధి యను వృత్తిలేదు గనుక నిర్గుడని చెప్పబడును.

ప్రశ్న :- శుద్ధుడనగా నెటువంటివాడు?

ఉత్త :- మాలిన్యరహితుడు.

ప్రశ్న :- నిత్యముక్తుడనగా నెటువంటివాడు?

ఉత్త :- సంసారాధిబంధములు లేనివాడు.

ప్రశ్న :- అసంగుడనగా నెటువంటివాడు?

Scanned by TapScanner

ఉత్త :- సంగరహితుడు.

ప్రశ్న :- అనాత్మయనగా నెట్టిది?

ఉత్త :- శరీరత్రయమును, బంచకోశములను, బంచవింశతి తత్త్వములును, ననాత్మయని చెప్పబడును.

ప్రశ్న :- అనాత్మ యనగా నింక నెటువంటిది?

ఉత్త :- అనృతదు:ఖ జడాత్మికమైనది.

ప్రశ్న :- పైన జెప్పబడిన, యాత్మయొక్క స్వరూపమును నెటుల నెఱుంగ వచ్చును?

ఉత్త :- లోకమునందు బియ్యము కావలసినవారు వడ్లు దంచి పొట్టు తవుడు పరిహరించి బియ్యము నెటుల గ్రహించుచున్నారో, యా ప్రకారమే పంచకోశముల వలన గప్పబడిన యాత్మను-సద్గురూ పదేశము, శాస్త్రదృష్టము, స్వానుభవము-అను నీ మూడు సాధనముల చేతను, బంచకోశ వ్యతిరిక్తుడైన, యాత్మని గుర్తెఱుగ వచ్చును.

ప్రశ్న :- పంచకోశములతో గూడిన శరీరమందు బంచకోశవ్యతిరిక్తుడై యాత్ముడెటువలె నున్నాడు?

ఉత్త :- ఆత్ముడు దేహమందుండియు, దేహేంద్రియాదులు చేసెడు కార్యములకు గర్తగాక, సాక్షిభూతుడై యున్నాడు. అది యెటువలె ననిన బ్రభువు తన కోట లోపల నుండియు దన ప్రధానులును దక్కిన జనులును జేయునట్టి పనులను సాక్షియై యేలాగున జూచుచున్నాడో, యాలాగుననే, దేహేంద్రియాదులు సేయుకార్యములకు వేఱుగాక నుండియు, నాత్ముడు సాక్షిభూతుడై చూచుచున్నాడు. అయితే నా దేహేంద్రియాదులు చేయు కార్యములజూచి, యీ కార్యము లాత్ముడు సేయుచున్నాడని కొంద

అజ్ఞానులు భ్రమించుచున్నారుగాని యదిసత్యముకాదు. ఏలాగన జంద్రుడు పరుగిడని వాడై యుండినను, వాయు వశము చేత మేఘములు పరుగిడుచుండగా, నాసమయముల జంద్రుడు పరుగిడునట్టుగా, భ్రమ యేలాగున గలుగుచున్నదో యాలాగునను; నోడ నీళ్లయందు మహావేగముగా వెళ్లుచుండు సమయములో, నీటిదరి యందుండెడు వృక్షములు కదల కుండియు, వృక్షములు పరుగెత్తు నట్టుగా, జిత్త విభ్రమ మేలాగున గలుగుచున్నదో, యాలాగునను; దేహేంద్రియాదులు సర్వకార్యములను జేయుచుండగా, దేహేంద్రియాదుల చేతం గప్పంబడిన యాత్మ సమస్తకార్యముల జేయుచున్నదను భ్రమయజ్ఞానము చేత గలుగుచున్నది గాని, నిజముకాదు. ఇదియునుంగాక, యాత్మ యందు జంచల భావమును గలదని, కొందఅజ్ఞానులు చెప్పుదురు. అదియును నిజముకాదు. ఎట్లనిన, నీటిలో బ్రతిఫలించిన చంద్రబింబము నీళ్లు చలించినప్పుడా ప్రతిబింబమును జలించినట్టు భ్రమదోచుచుండగా జలించని చంద్రుడు చలించుచున్నాడని యాజ్ఞాను లెట్లు భావింతురో, యటు వలేనే చంచలములేని యాత్మ యం దంత:కరణ నిష్ఠమైన చాంచల్యము గలదని యజ్ఞానులు భావింతురేకాని, యది నిజముకాదు.

ప్రశ్న :- అయితే, మనోబుద్ధి చిత్తాహంకారము లాత్మయొక్క సమీప మందుండియును, నాత్మను గుర్తెఱుగకుండుటకు గారణమేమి?

ఉత్త :- దీపము గృహమునందుండెడు సమస్త వస్తువులను బ్రకాశింప జేయుచున్నదైనను, నా వస్తువులకు మిక్కిలి సమీపమందున్నదైనను జడములైన యావస్తువులా దీపము నెటుల గుర్తెఱుంగవో యటు వలెనే, జడములైన బుద్ధి మొదలగునవి యాత్మను గనుగొనజాలవు.

ఆత్మజ్ఞానస్వరూపుడై సర్వదా ప్రకాశవంతుడైయున్నాడు. కనుక నట్టి యాత్మను గుర్తెరుగుటకు మఱియొక జ్ఞానము కావలసినది లేదు. ఎట్లనిన, నొక దీపము కనుగొనుటకు మఱియొక దీపము కావలసిన పని యెట్లు లేదో యటువలెనే యని తెలియవలెను గనుక, నీ విధముగా శ్రవణమనన నిథిధ్యాసముల చేత నాత్మను గుర్తెఱింగిన వారలే జ్ఞానులని చెప్పబడుదురు. ఇట్టి జ్ఞానులే మోక్షార్హులు. జ్ఞానహీనులై యనేక బ్రహ్మకల్పములు మోక్షాపేక్షచే నెన్ని ప్రయత్నములు చేసినప్పటికిని మోక్షము గలుగదు. ఇందుకు సమ్మతము॥ "జ్ఞానాన్మోక్ష: " అనియను "జ్ఞానంవినా మోక్షోన సిధ్యతి" అనియును. శ్రుతివాక్యములు గనుక, జ్ఞానమువలననే మోక్షసిద్ధి గలుగును. మోక్షేచ్ఛ గలవారు, జ్ఞానాభ్యాసము ముఖ్యముగా జేయవలయును. అట్టి జ్ఞానాభ్యాసము గలవా రసంగ వృత్తి గలవారని చెప్పబడుదురు.

ప్రశ్న :- జ్ఞానులైన వారును సమస్తలోక వ్యవహారములను జేయుచున్న వారలై యుండగా నసంగులని యెటుల జెప్పవచ్చును?

ఉత్త :- శ్రవణ, మనన, నిధి, ధ్యాసము చేతను, గురువాక్యము వలనను, శాస్త్రదృష్టము వలనను, నాత్మనిశ్చయము వలనను, దానే నిర్గుణాత్మగా గుర్తెఱిగి, యనాత్మస్వరూపములైన శరీరము, మనస్సు ప్రాణములు తాను గానన్న నిశ్చయ మెఱిగినందున, శరీర ధర్మములయిన జనన మరణములును. మనోధర్మములైన సుఖదు:ఖములును, ప్రాణధర్మములైన క్షుత్పిపాసలును, నేను గుర్తెఱగనని చెప్పుట యేమియాశ్చర్యము? ఎట్లనిన, విననివాడును, గననివాడును, నననివాడును, స్పృశించనివాడును, నాఘ్రాణించని వాడును నైన, నిర్గుణాత్మ తానేయను నిశ్చయము గలవాడు సమస్త

లోక వ్యవహారములు చేయుచున్నప్పటికిని, నాకార్యములు తను జేయుచున్నాననిగాని యందుకు దానుగర్తయని గాని చెప్పడు. నిశ్చయముగా భ్రాంతిని బొందదు కనుక సంగరహితుడనుటకు సందేహము లేదు. మఱియు స్త్రీ వేషధారియైన పురుషుడు, తాను బురుషుడనేగాని, స్త్రీనిగానని తన నిజమును దానెఱిగి యుండుటచే నతడు గనుపఱచు స్త్రీ విరహాదినటన లతని కెట్లు చెందవో యాలాగే, నిర్గుణాత్మ తానని గుర్తెఱిగిన వాడు, తానుగాని దేహేంద్రియాదుల యొక్క వ్యాపారముల చే దన నిస్సంగత్వమునకు హాని గలుగునని భ్రమించడు. (ఉపమానమునందు) స్త్రీ వేషము ధరించక పూర్వమును ధరించి నటించుచున్న పురుషుడును, నావేషము విడిచినపుడును నీ త్రికాలముల యందును, వాని పురుషత్వమునకు నెట్లు భంగము గలుగ లేదో, యాలాగే వేత్త - తన యింద్రియ మనంబును చెలించక పూర్వమును జెలించు చున్నప్పుడును, నిలిచినప్పుడును నిశ్చలుడును నిస్సంగుడునునై యున్నాడు.

ప్రశ్న :- ఇటుల లోకవ్యవహారము లాచరించినవారలై యుండియు మోక్షమును బొందినవార లెవరైనగలరా?

ఉత్త :- అట్టివారలనేకులు గలరు. వారలలో గొందఱిని జెప్పుచున్నాను. వారలెవరనిన; వసిష్ఠమహాఋషి పుత్ర మిత్ర కళత్రాదులతో గూడిన వాడయ్యును, జ్ఞానులలో శ్రేష్ఠుడనిపించుకొనెను. జనక మహారాజు రాజ్యభారము వహించి దుష్టనిగ్రహ శిష్ట పరిపాలన జేసిన వాడయ్యును, జ్ఞానులలో నగ్రేసరుండనిపించుకొనెను. తులాధారుడు వాణిజ్యవృత్తిచే జీవించినవాడయ్యును, జ్ఞానులలో నుత్తముండనిపించుకొనెను. ధర్మవ్యాధుడు కటిక వృత్తిచే జీవించిన వాడయ్యును, జ్ఞానులలో బ్రసిద్ధిగాంచెను. కనుక జ్ఞానులు ప్రారబ్ధ

Scanned by TapScanner

వశముచేత నెటువంటి వ్యవహారము లాచరించినను, వారల జీవన్ముక్తులనుటకు సంశయము లేదు.

ప్రశ్న :- ప్రారబ్ధము, జ్ఞానులుకూడ ననుభవించవలసినదిగా జెప్పితిరిగదా అగామి సంచితము లేమయ్యెను?

ఉత్త :- జ్ఞానోదయమైనదే యజ్ఞానము నశించును అజ్ఞానము నశించగానే యజ్ఞాన సంబంధములగు సంచితములన్నియు నశించును. అగామి కర్మలెటుల నశించుననిన – జ్ఞానియయిన తర్వాత, నతడు చేయు పుణ్యపాపంబుల కర్తయయిన యతనిం జెందవు. అతని భూషించిన వారలకు బుణ్యములను, నతని దూషించిన వారలకు బాపములును జెందుచున్నవి. ఇందుకు సమ్మతము॥

శ్లో॥ **ప్రారబ్ధం భోగతోనశ్యే । తత్త్వజ్ఞానేన సంచితం ।**
ఆగామి ద్వివిధంకర్మ । తద్ద్వేషి ప్రియవాదినాం॥

అనియున్నది. గనుక, నట్టి జ్ఞానులు విదేహకైవల్యమును బొందుదురు. వారలకే జన్మరాహిత్మము. ఇందుకు సమ్మతము॥

శ్లో॥ **"అగ్నిదగ్ధంయథాబీజం । శాఖాపల్లవవర్జితం ।**
జ్ఞానదగ్ధంతథాయోగి । పునర్జన్మనవిద్యతే॥" అని యున్నది గనుక, జ్ఞానులైన వారలకు జ్ఞానోదయమైనదే యాగామి సంచితములు నశించునుగాని, ప్రారబ్ధము మాత్ర మనుభవించక తీరదు గనుక జ్ఞానులై నప్పటికిని, బ్రారబ్ధవశము చేత నెటువంటి వ్యవహారములు చేసినను వారలకు నేదోషమును నంటదు.

ప్రశ్న :- అయితే, నట్లు జ్ఞానులు సమస్త కర్మలాచరించుచుండగా కర్మానుభవము వారలనెటుల బొందదు?

ఉత్త :- అది యెటువలెననిన –దామర నీళ్ళయందు బుట్టినదైనను నెల్లప్పుడు నీళ్ళయందే యున్నదైనను, తామరాకునందు నెటుల నీరంటదో యటువలెను, జిహ్వాయందు నెయ్యి మొదలయిన

Scanned by TapScanner

పదార్థము లెటులనంటవో యటువలెను, జల్లలో వెన్న యెటుల గలియదో యటువలెను, గుమ్మరపురుగు బురదయందు దిరిగి నప్పటికిని నాబురద యెటులనంటదో యటువలెను, గచ్చకాయ యందు బూడిద యెటెల నంటదో యటువలెను, జింతగుల్లకు జింతపండు నెటులనంటదో యటులవలెను, జ్ఞానులైన వారలు లోక వ్యవహారసంబంధములతో గూడి కొనిన వారలై నప్పటికిని వారలకు నేవిధమైన దోషములును నంటవు.

ప్రశ్న :- బ్రహ్మణులే మోక్షార్హులని చెప్పుదురు నాకు దమబోధ వలన జ్ఞానులకు దప్ప నితరులకు మోక్షము లేదని దృఢమైనది. బ్రాహ్మణభావం బెటువంటిదో యానతీయవలెను?

ఉత్త :- బ్రహ్మభావముగలవారె బ్రాహ్మణులు, వార లెటువంటివారలనిన లేనిశరీరము లెన్నటికి లేవను దృఢముగలవారు. అతిశాంతులు అనుకూలమను కులముగలవారు. ఉపదేశమను దేశముగల వారు, నిదానమను దానముగలవారు. సమ్మతమను మతము గలవారు. సర్వమిత్రత్వమను గోత్రముగలవారు. అంటియంటక యుండుటే యింటిపేరుగలవారు. విదేహమను దేహముగలవారు. శాంతమను నడతగలవారు. ఆకర్తృత్వమే క్రియగాగలవారు క్షరాక్షర రహితత్వమను పేరుగలవారు. అచలుడను గురువు గలవారు బ్రాహ్మణత్వము దేని నవలంబించుకొని వచ్చినదో మనము విచిరించవలసినదిగా నున్నది.

1. జీవుని, నవలంబించుకొని వచ్చినదని చెప్పెదమనిన జీవుడు సమస్త శరీరముల యందును - నేకరూపముగా నున్నాడు గనుక సర్వజీవులకు బ్రహ్మణులను పేరు రావలెను గదా; యటుల రాలేదు. కాబట్టి బ్రాహ్మణత్వము జీవుని నవలంబించుకొని వచ్చినదని చెప్పుటకూడదు.

Scanned by TapScanner

2. శరీరము నవలంబిచుకొని వచ్చినదని చెప్పెదమనిన బ్రాహ్మణాది చండాల పర్యంతమును నుండు శరీరములన్నియును బాంచ భౌతికములై ధర్మాధర్మములను జేయుచు జననమరణాద్యవస్థలను బొందియున్నవి. కనుక బ్రాహ్మణత్వము శరీరమును నవలంబిచి వచ్చినదని చెప్పకూడదు.

3. బ్రాహ్మణుడు శ్వేతవర్ణము గలవాడనియును, క్షత్రియుడు రక్తవర్ణము గలవాడనియును, వైశ్యుడు పీతవర్ణము గలవాడనియును, శూద్రుడు నీలవర్ణము గలవాడనియును, జెప్పంబడి యున్నది గనుక శరీర కాంతిని నవలంబించుకొని వచ్చినదని చెప్పెదమనిన హూణులు, మ్లేచ్ఛులు, మిక్కిలి తెలుపును నెఱుపును గలవారలై యున్నారు. ఇంకను నితరులైన సర్వజనులును, నిట్టి కాంతిగలవారలై యున్నారు గనుక, నిట్టి కాంతిగలవారి కందఱికిని బ్రాహ్మణత్వము రావలెనుగదా? అటుల రాలేదు. శుక్లశోణితముల వలన వచ్చినదైయున్నది, గనుక బ్రాహ్మణత్వము దేహకాంతి నవలంబించి వచ్చినదని చెప్పగూడదు. ఇంతేకాక శరీరమునకు బ్రాహ్మణత్వము వచ్చినట్లయితే మరణాంతమునందు నట్టి శరీరము కుమారుని చేత నగ్ని సంస్కారము చేయంబడుచున్నది. అందువలన గుమారునకు బ్రహ్మహత్యదోషము రావలెను ఆ దోషము రాలేదు గనుక, నట్లు చెప్పగూడదు.

4. శిఖా యజ్ఞోపవీతములను నవలంబించుకొని వచ్చినదని చెప్పెదమనిన శిఖా యజ్ఞోపవీతము లన్యకులస్థులకును గలవు. కనుక వారలకును బ్రాహ్మణత్వము రావలేను. అటులరాలేదు. కాబట్టి శిఖా యజ్ఞోపవీతముల నవలంబించి వచ్చినదని చెప్పగూడదు.

Scanned by TapScanner

5. తెలివిని నవలంబించి వచ్చినదని చెప్పెదమనిన దెలివి సర్వజనులకును గలదు గనుక, సర్వజరులకును బ్రాహ్మణత్వము రావలెనుగదా? అటుల రాలేదు గనుక, తెలివిని నవలంబించి వచ్చినదని చెప్పగూడదు.
6. కర్మ నవలబించి వచ్చినదని చెప్పెదమనిన, నాగామి, సంచితము, ప్రారబ్ధములను కర్మలను సర్వజనులు ననుభవిచుచున్నారు. గనుక సర్వజనులకును బ్రాహ్మణత్వము రావలెను. రాలేదు గనుక కర్మ నవలంబించి వచ్చినదని చెప్పగూడదు.
7. దానము నవలంబించి వచ్చినదని చెప్పెదమనిన – దానము సర్వజనుల చేత జేయంబడుచున్నది. రాజుల చేత మిక్కిలిగా జేయబడుచున్నది. గనుక, సర్వజనులకు బ్రాహ్మణత్వము రావలెను. అటుల రాలేదు గనుక, దానము నవలంబించి వచ్చినదని చెప్పగూడదు.
8. కులము నవలంబించి వచ్చినదని చెప్పెదమనిన–ఈ బ్రాహ్మణులని చెప్పెదు వారి వంశమును గురించి విచారించగా – ఋష్యశృంగుడు మృగమునకుం బుట్టెను. కౌశికుడు దర్భయందు బుట్టెను. వాల్మీకి బోయకులమందు బుట్టెను. వ్యాసుడు బెస్తదానికిన్ బుట్టెను. అగస్త్యుడు కలశములో బుట్టెను. వశిష్టుడు దూర్వశికిన్ బుట్టెను. గౌతముడు లేడికిన్ బుట్టెను. జాంబవంతుడు నక్కకున్ బుట్టెను. నారదుడు చాకలి దానికిన్ బుట్టెను కనుక, నీ విధముగా దిర్యగ్జంతువులకును, నీచ జంతువులకును, జన్మించిన వారికే బ్రాహ్మణత్వము వచ్చినట్టైతే, మనుష్య జాతి యందు జన్మించిన వారి కందటికిని సాధారణముగా బ్రహ్మణత్వము రాకుండుటకు గారణమేమి? గనుక, కులము నవలంబించి వచ్చినదని చెప్పగూడదు.

Scanned by TapScanner

9. ఎందువలన వచ్చినదనిన - బ్రహ్మజ్ఞానము నవలంబించి బ్రాహ్మణత్వము వచ్చినదే గాని, ఇతర కారణముల వలన వచ్చినది కాదు. ఇందుకు సంశయము లేదు. ఈ వాక్య ప్రమాణములు సత్యములు గాను వేదయుక్తములుగాను నమ్మవలెను. దీనికి సమ్మతి॥

శ్లో॥ జన్మనాజాయతే శూద్ర: । కర్మణా జాయతేద్విజ: ।
వేదపాఠంతు విప్రాణం । బ్రహ్మజ్ఞానంతు బ్రాహ్మణ:॥

అని యున్నది.

ప్రశ్న :- అయితే బ్రహ్మముఖమందు బ్రాహ్మణులును, బాహువులయందు క్షత్రియులను, నూరువులయందు వైశ్యులును, బాదములయందు శూద్రులును, బుట్టినట్లు చెప్పుదురు. ఆ భావం బెటువంటిదో యానతియ్యవలయును?

ఉత్త :- ఈ నామములు సాధారణముగా వృత్తుల నవలంబించి వచ్చినవిగాని, పుట్టుక వలన రాలేదు. ఏలాగనిన 'బ్రహ్మజ్ఞానంతు బ్రాహ్మణ:' అనురీతిని, బ్రహ్మవిచారణ చేసినవారు బ్రాహ్మణులగుదురు. బ్రహ్మవిచారణ చేయవలేనని యే గ్రంథమందు నున్నదనిన - వేదములయందున్నది. అట్టి వేదములను జదువుటకు, నట్టివారిని కొందఱిని, బూర్వీకులుగా నియమించి, వారికి నేర్పఱచిన వృత్తి ఏమనగా - స్నాన - సంధ్యావందన - జప - తప - హోమాది విధులు చేయవలసినదిగాను, వేద శాస్త్రములు చదివి వాని యర్థములు చక్కగా దెలుసుకొని యితరులకు ధర్మాధర్మములును, బాపపుణ్యములును, మోక్ష నరకములును, మెుదలుగాగల నీతిమార్గములన్నియు బోధించుటకును, యజన - యజనా - ధ్యయనా - ధ్యాపన - దాన - ప్రతి గ్రహములనెడు, షట్కర్మలయందు నిరతులై

తత్ఫలార్థమంత్రాత్ములై వాక్కు వలన జీవించు వారు గనుకను, నట్టి వాక్కు ముఖమందుండునది గనుకను ముఖము వలన జీవించు వారనేకాని, ముఖమందు బుట్టిన వారిని చెప్పకూడదు. పూర్వీకులైన యిటువంటి వారు తమకు నేకొఱతలు లేక జీవనములను జరుపుకొనుచు దమకు సంభవించు నపాయములను బోగొట్టుకొనుచుం జేయవలసిన కార్యములను చక్కగా జేయని వారలను శిక్షించుచున్నారు. అట్టి కాలములో భుక్తి విషయమై లోపము లేనందువల్ల ముక్తిమార్గ విషయమైన బ్రహ్మవిచారణయే సేయుచుండిరి. ఇప్పుడా విధముగా భుక్తి జరుపువారు లేరుగనుక వారలు బ్రహ్మవిచారణ వృత్తిని మాని, భుక్తి కొఱకై యనేక వ్యాపారములను జేయుచున్నారు గనుక, వారికి బ్రహ్మణత్వము కలదని యెంతమాత్రమును జెప్పగూడదు. బ్రహ్మణ అతీత బ్రాహ్మణ: అను ఉత్పత్తి వలనను జెప్పగూడదు ।।స్మృతి।। యోనధీత్య ద్విజోవేదాన్ । యోన్యత్ర కురుతేద్విజ:। సజీవన్నేన శూద్రత్వం । ఆశుగచ్ఛతిని స్వయ:।। అని స్మృతి।। ఇంతేకాక వృత్తివలన గులము,వచ్చినదని చెప్పుటకు నింకను గొన్ని దృష్టాంతరములు గలవు. గుడ్డలుతుకుట వలన రజకుండనియు, క్షౌరము చేసినందువలన క్షౌరకుండనియు గుండలు చేయుటవలన గుంభకారుడనియు, గుడ్డలు నేయుటవలన తంతువాయకుండనియు జెప్పుచున్నారు. ఇదియునుంగాక కంసాలి కులములో నొక తండ్రికి గుమాళ్ళయిదుగురున్నప్పుడు, వారు చేయు వృత్తినింబట్టి (ఇనుము పని చేసినందున గమ్మరబత్తుండనియు గట్టుపని చేసినందున వడ్రంగి బత్తుడనియు, రాతి పని చేసినవానికి గాశీబత్తుండనియు గంచును నిత్తడి పనులు చేసినందున గంచరబత్తుడనియు, బంగారు

పనులు చేసినందున నగసాలబత్తుడనియు జెప్పుదురు) ఇంక నిరతములైన పనులు చేయువారల కనేకములైన నామములు చెప్పుదురు. ఇటువంటి నామములు వృత్తులనవలంబించి వచ్చినవిగాని పుట్టుక వలన వచ్చినవి కావు. ఇందుకు సమ్మతము ॥స్మృతి॥ "చాతుర్వర్ణం మయాసృష్టం గుణకర్మవిభాగత:"॥ మఱియొక దృష్టాంతమును గలదు. పనస వృక్షమునకు శాఖాగ్రమునందును, శాఖలకు మధ్యమందును, మాను మధ్యను వ్రేళ్ళయందును గాయలు పుట్టి పండ్లు పండినవి. ఆ పండ్లకు రూపభేదమును, రుచి భేదమును, నామ భేదమును లేదు. అవియన్నియు బనసపండ్లనియే చెప్పుదురు. అటువలె మనుష్యులందఱును, నేకమైన బ్రహ్మవల్లనే పుట్టబడిన వారై యుండియు నామభేదములు వచ్చుటకు గారణ మేమనగా వృత్తివలన వచ్చినవిగాని, పుట్టుకవలన వచ్చినవి కావు. కనుక వీరలను బ్రహ్మణులనుట యెట్లున్నదనిన నేతి బీరకాయ యన్నట్టును, బెల్లంకొండ యన్నట్టును, బంగారపుగొండ యన్నట్టును సువర్ణముఖి యన్నట్టును నున్నది. వీనియందు వ్యవహారనామమే గాని, క్రియవలన నెయ్యియు, బెల్లమును బంగారమునుగానము. అటువలె వీరలకును నామముమాత్రమే కాని, క్రియ వలన బ్రహ్మజ్ఞానము కొందఱియందు గానము. అంతేగాక కొన్ని గ్రామములయందు వాడుకగా నీ గ్రామములో బ్రాహ్మణ యిండ్లెన్ని యున్నవని విచారించిన రెండిండ్లున్నవని చెప్పుదురు. తరువాతి వీధికి వెళ్ళినప్పుడవి బ్రాహ్మణుల యిండ్లవలెనున్నవి. ఇవి యెవరి యిండ్లని యడిగిన యివి కరణముల యిండ్లని చెప్పుదురు. కనుక నీ నామము వీరలకెందులకు వచ్చినదనిన గరిణీక వృత్తివలన వచ్చినదని స్పష్టముగా దెలియబడుచున్నది. కనుక వృత్తి వలన

వచ్చిన నామములేగాని, పుట్టుక వలన వచ్చినవి కావు. క్షత్రియుల సంగతి నాలోచించగా, వారు బాహులందు బుట్టిన వారు కారు. బాహుల వలన జీవించు వారు గనుక, నీ పేరు వచ్చినది. అస్త్రశస్త్రధారులై బాహుబలపరాక్రమముల చేత, జీవించెడి వారు గనుకను 'క్షతాత్త్రాయతే - ఇతిక్షత్రియ:' అను నుత్పత్త్యను సారముననను వారికి బాహుబలముచే జీవించుట కులధర్మము గనుకను, వృత్తి వలన వచ్చినదని చెప్పుటకు నెంతమాత్రము సంశయములేదు. వైశ్యుల సంగతి విచారించగా, నూరువులందు బుట్టినారనుట యబద్ధము. ఎట్టులనగా నూరులవలన జీవించు వారలై యున్నారు. ఎటులన, నూరువుల యాధారముచే గూర్చుండి, వాణిజ్యవృత్తిచే జీవించువారలైయున్నారు. అందువలననే, (విశంతీతి వైశ్యా:) అను నవయవార్థాను సారమున వైశ్యులని, వర్తకులని పేరు వచ్చినది. ఇందుకు దృష్టాంతము లోకమందు నితరులగు జనులు కూడ వర్తకము చేసినప్పుడు వారుకూడ వర్తకులని పిలువబడుచున్నారు. గనుక, వృత్తివలన నట్టి పేరు వచ్చినదనుటకు సంశయ మెంతమాత్రమును లేదు. శూద్రుల విషయమై యాలోచించగా బాదములందు బుట్టి నారని చెప్పుటయబద్ధము. మఱియును శూద్రులు, వ్యవసాయము మొదలగు పనులు చేయుటకు బాదచారి వృత్తి కావలెను గనుక, నట్టి పాదచారి వృత్తిచే జీవించి నందువలన, నట్టి పేరు వచ్చినది గాని పుట్టుక వలన వచ్చినది కాదు. ఇందుకు దృష్టాంతము లోకములో నితర జనులును వ్యవసాయము చేసినట్లయితే, వారలకు శూద్రలని లేక రయితులని పిలుచుచున్నారు. దీనికి సమ్మతి॥

తస్మాత్పాదా ఉపజీవిత:॥

టీక ॥ పూర్వోక్త కారణము వలన మంచి శూద్రులు పాదముల వలన నుండి జీవించవలసినది. వేదశాస్త్రములలో నజ్ఞానవే శూద్రత్వమని తేటగా వ్రాయబడినది. దీనికి ననుకూలముగానే, పరమహంస స్వరూపులైన వేమన్నగారు మొదలగు కొందఱు యోగపురుషులు వ్రాసియున్నారు. శూద్రత్వ మజ్ఞానమును బట్టియు, నభిమానముబట్టియు, వచ్చినదని యీక్రింది వ్రాయబడిన దానివలన స్పష్టమగుచున్నది. "శైవమతోద్ధారకుండైన బసవేశ్వరుల వారు, లింగ బలిజకులస్థుడైన చెన్నయ్యగారి యొద్ద గటాక్షమను బొంది తీర్థప్రసాదములు పుచ్చుకొనిరి. అద్వైతమతోద్ధారకుండైన శంకరాచార్యులవారు, అంత్యజుని యొద్ద గటాక్షమును బొంది తీర్థప్రసాదములును బుచ్చుకొనిరి, రామానుజ మతోద్ధారకుండైన రామానుజులవారు, పంచములైన మారునూరి నంబిగారికిని, దిరుప్పాణ్యాళ్వారుల వారికిని రెడ్డికులస్థుడైన నమ్మాళ్వారులవారికిని, భక్తుడై వారి కటాక్షమును బొంది తీర్థప్రసాదములు పుచ్చుకొనిరి. హిందూమతోద్ధారకులగు నీ ముగ్గురున్ను, నజ్ఞానరహితులై నిజమైన బ్రాహ్మణులు గనుకనె, కులభేదములు జాతిభేదములు, నివి యజ్ఞానమువలన వచ్చినవని తెలుసుకొనిన వారలై, జాతిభేదము, కులభేదము నెంచక, యన్యకులస్థుల యొక్క తీర్థప్రసాదములను త్రికరణశుద్ధిగా గ్రహించిరి"॥ ఇదియునుం గాక, శ్రీకృష్ణమూర్తి పంచమవేదమైన, భారతమునందు దుర్యోధనునకు జెప్పిన వాక్యము విష్ణుభక్తి పరాయణుండైన మనుజుడు నాలవ జాతియందు జన్మించిన వాడైనను, పరమ భాగవతోత్తముండైన బ్రాహ్మణుండ నంబరగు, ననియును, సకల జాతులయందు విష్ణుభక్తి లేనివాడు శూద్రుండనం బరగుననియు దేటపఱచియున్నారు. శ్రీభాగవ

Scanned by TapScanner

తమందు నమలజ్ఞాన రహితుండను, షట్కర్మనిరతుడునునగు బ్రాహ్మణునికంటె నమలజ్ఞాన సహితుడైన శ్వపచుడు మేలని మెరుంగబడుచున్నది. "జన్మనాజాయతేశ్శూద్ర:" యని స్మృతి: గనుకనే స్త్రీలును, శూద్రులును, వేదములను వినగూడదనియు జదువగూడదనియు భారతమందును, యజుర్వేదమందును జెప్పబడియున్నది దీనికి సమ్మతి స్మృతి॥ **స్త్రీశూద్ర బ్రహ్మబిన్దూనాం త్రయీన శ్రుతిగోచరా'** ॥శ్రుతి॥ **"నస్త్రీశూద్రౌవేదమధీయ తామ్"**॥ అనియున్నది గనుక బ్రహ్మజ్ఞానము గలవారే బ్రాహ్మణులని చెప్పుటకు నే సందేహమున్న లేదు. ఇది యనేక మార్లకు సత్యం॥ సత్యం॥ సత్యం॥ ఇట్టివారే మోక్షార్హులు వ్యవహారత్వేన బ్రాహ్మణులుగా నుండు వారు, మోక్షార్హులుగారు. ఇది సత్యము సత్యము. ఇందుకు సమ్మతముగా, మద్గురు మూర్తియు బరమహంసయునగు, పులహరి ఫిరోజిగారి వలన రచియింపబడి యీక్రింద వ్రాయబడిన ప్రశ్నోత్తర సంవాదము వలన దేటపడును.

పున్నాగ రాగము - అటతాళము

ధరణిలోపలను భూసుర ముఖ్యులను జూచి । శరణు సేయనట్టి సరణియేమయ్యా । ఫీరుదాస । ఫీరుదాస సుగుణవికాస ఫీరుదాస॥ పరమాత్మతత్వతత్పరులైన । యోజాతినరులైన వారికి శరణార్థినన్నా ॥ లక్ష్మణాఖ్యా । లక్ష్మణాఖ్య । దాక్షిణ్యసఖ్యా । లక్ష్మణాఖ్య॥

(1) ధరనువర్ణాశ్రమదర్మాతిశయములు పరికింపవలసిన పద్ధతి కాదా । ఫీరదాస । అరయతృణాదిపం । కరుహగర్భాస్తమీ । శ్వరుడగు నతనికి శరణార్థినన్నా॥ లక్ష్మణాఖ్యా॥ (2) గణుతింప బ్రాహ్మణాగ్రణుల గన్గొనిభువి । ప్రణుతింపవలెనన్న ఫణతియేమయ్యా । ఫీరుదాస । అణుమాత్రమైనచి । దాత్మను గనువిచక్షణులెవ్వరైన బ్రాహ్మణులవుదురన్నా॥ లక్ష్మణాఖ్యా॥

Scanned by TapScanner

(3) కరమొప్ప వేదాధికారులైన భూసురులెముఖ్యులని స్మరియింతురేమయా । ఫీరుదాసా । అరయగ నిగమాగమాంత వేత్తలయిన పరమసాధులు వంశకరులవుదురన్నా। లక్ష్మణాఖ్యా॥ (4) భువిచాతుర్వర్ణ మానవులందునగ్ర । సంభవులె యోగ్యులని పల్కుటేమయ్యా । ఫీరుదాస వివరింప కులమేమి స్తవ నీయమయ్యె నెక్కువగుణయుతుని మక్కువసేతురన్నా॥ లక్ష్మణాఖ్యా॥ (5) పరికింపషట్కర్మనిరతులై యహింసా । పరులైన వారేభూసురులందు రేమయ్యా । ఫీరుదాసా । సరవిన్శ్వపచుడై నహ భక్తిజ్ఞానభాసురుడైన వాడగ్రేసరుడందురన్న । లక్ష్మణాఖ్యా॥ పరగవాజిపెయ పౌండరీకాదుల । నెఱపువారలె ధరాసురులందు రేమయ్యా । ఫీరుదాస నిరహంకృతిని । పరాత్పర భావమొందిన । నరులనె బ్రహ్మవిద్వరు లందురన్నా । లక్ష్మణాఖ్యా॥ (6) గాయత్రీమంత్ర శిఖోపవీతోపా । ధ్యాయులెద్విజులని తలంచుటేమయ్యా । ఫీరుదాసా । హాయినసదాజప । గాయత్రీ మంత్ర విధేయులౌ వారేసుధీయుతులన్నా । లక్ష్మణాఖ్యా॥ (7) జలజభవానన జలజసంభవులని యిలలో విఖ్యాతిగ పల్కుటేమయ్యా । ఫీరుదాసా । పొలుపొందురెచ్చోట । పొడముచుండు నాయాస్థలమే యోనిగనార్యుల్దలపోతురన్నా । లక్ష్మణాఖ్యా॥ (8) భాసుర భద్రాద్రివాసుడైన శ్రీనివాసుని గలసేటి దాసులెవరయ్యా । ఫీరుదాసా । సుగుణవికాస పీరుదాసా । వాసనరహిరులై ధీసాక్షియగు సద్వికాసు నెఱిగిన వారెదాసులవుదురన్నా ॥ లక్ష్మణాఖ్యా । దాక్షిణ్యసఖ్యా । లక్ష్మణాఖ్యా ॥ బిడ్డా! యింద్రియాదులును, వాని స్థానములును, వాని యధి దేవతలును, వాని విషయములును, నివియన్నియు నాత్మకాదని చెప్పుచున్నాను, గనుక శ్రద్ధాసక్తుండవై వినుము.

1. శ్రోత్రేంద్రియము – చెవులను గోళాకారము నందుండి, లౌకిక వైదిక, శబ్దాదులను వినునది. వీనికి నధిదేవతలు దిక్కులు, ఇది యాకాశగుణము గనుక, నాత్మయని చెప్పగూడదు.

Scanned by TapScanner

2. త్వగింద్రియము - చర్మమందుండి, శీతోష్ణములను గ్రహించుచుండును. వీనికి వాయువధిదేవత. స్పర్శము వాయువు యొక్క గుణము గనుక, నాత్మయని చెప్పగూడదు.
3. చక్షురింద్రియము - నల్లగుడ్డు మధ్యయందుండి నానారూపములను జూచుచుండును. వానికి నధిదేవత సూర్యుడు రూపమగ్ని గుణము గనుక, నాత్మయని చెప్పగూడదు.
4. జిహ్వేంద్రియము - కొననాలుక యందుండి షడ్రసములను గ్రహించుచుండును. వీనికి నధిదేవత వరుణుడు ఇది జలగుణము గనుక, నాత్మయని చెప్పగూడదు.
5. ఘ్రాణేంద్రియము - నాశికమునందుండి, సుగంధ దుర్గంధాదుల నాఘ్రాణించుచుండును. వీనికి నధిదేవత లశ్వినీ దేవతలు. ఇది గంధ విషయము. ఇది పృథ్విగుణము గనుక, నాత్మయని చెప్పగూడదు.

1. వాగింద్రియము - వాక్కునందుండి, నానాలౌకిక, వైదిక వాక్యములను వచించుచుండును. వీనికి నధిదేవత యగ్ని. ఇది యాకాశగుణము గనుక, నాత్మయని చెప్పగూడదు.
2. పాణీంద్రియము - చేతులయందుండి, ఇచ్చిపుచ్చుకొను వ్యవహారములను జేయుచుండును. దీనికి నధిదేవత యింద్రుడు. ఇది వాయుగుణము గనుక, నాత్మయని చెప్పగూడదు.
3. పాదేంద్రియము - కాళ్ళయందుండి గమనాగమనములు చేయుచుండును. వీనికి నధిదేవత యుపేంద్రుడు ఇది యగ్ని గుణము గనుక నాత్మయని చెప్పగూడదు.
4. ఉపస్థేంద్రియము - లింగ యోనియందుండి, శుక్లశోణిత మూత్రవిసర్జనానందములను జేయుచుండును. వీనికి నధిదేవత

బ్రహ్మ, ఇది జలగుణము గనుక, నాత్మయని చెప్పగూడదు.

5. పాయురింద్రియము – గుదస్థానమునందుండి మల విసర్జనముల జేయుచుండును. వీనికి నధిదేవత మృత్యువు. ఇది పృథ్విగుణము గనుక, నాత్మయని చెప్పగూడదు.

1. ప్రాణవాయువు – ఇంద్ర నీలవర్ణము గలిగి హృదయముందుండి, ఉచ్ఛ్వాస నిశ్వాసములను జేయుచుండును. వీనికి నధిదేవత విశిష్టుడు, ఈ ప్రాణవాయువు ప్రధానమైన సముదాయ పంచభూతగుణములలో నొకటి గనుక, నాత్మయని చెప్పగూడదు.

2. అపానము – పీతవర్ణము గల్గి గుదస్థానమందుండి, మూత్ర పురీష విసర్జనములు చేయుచుండును. వీనికి నధిదేవత విశ్వకర్త. ఈ యపానవాయువు ప్రధానమైన సముదాయ పంచభూత గుణములలో నొక్కటి గనుక నాత్మయని చెప్పగూడదు.

3. వ్యానవాయువు – గోక్షీర వర్ణము కలిగి సర్వశరీరములందు వ్యాపించి శీతోష్ణముల నెఱిగి శరీరములను గాపాడుచుండును. వీనికి నధిదేవత విశ్వయోని. వ్యానవాయువు ప్రధానమైన సముదాయ పంచభూతగుణములలో నొక్కటి గనుక నాత్మయని చెప్పగూడదు.

4. ఉదానవాయువు – మెఱుపుదీగె వర్ణము గలిగి కంఠస్థానమందుండి, విచిత్రమైన లౌకిక వైదికవాక్యముల బలికింపజేయుచు, సుషుప్త్యవస్థయం దింద్రియాదు లన్నింటిని దీసుకొని పోయి, యవిద్యలో గలుపుచు, జాగ్రదావస్థయందు వాని వాని గోళాకారములయందుండి, వాటిని నిలుపుచు, మరణ సమయమందు వీటినన్నిటిని లోకాంతరాళమునకుం దీసుకపోవును. వీనికి నధిదేవత అజుడు. ఉదానవాయువు

Scanned by TapScanner

సముదాయ పంచభూత గుణములలో నొకటి గనుక, నాత్మయని చెప్పగూడదు.

5. సమానవాయువు - నీలవర్ణము కలిగి నాభిస్థానమందుండి, భక్షించిన పదార్థముల సారములన్నింటిని డెబ్బది రెండువేల నాడులకు బంచి పెట్టుచుండును. వీనికి నధిదేవత జయుడు. సమానవాయువు ప్రధానమైన సముదాయ పంచభూత గుణములలో నొక్కటి గనుక, నాత్మయని చెప్పగూడదు.

1. నాగ వాయువు - పీత వర్ణము గలిగి గీత రాగాదులను జేయించుచు, హృదయమందుండి వాంతిచేయు చుండును. వీనికి నధిదేవత విశిష్టుడు. ఇది ప్రాణవాయువునకు నుపవాయువు గనుక నాత్మయని చెప్పగూడదు.

2. కూర్మ వాయువు - శ్వేతవర్ణము కలిగి గుదస్థానమందుండి, నోరులు గన్నులను మూయించుచు దెఱపించుచుండును. వీనికి నధిదేవత విశ్వకర్త. ఇది యపానవాయువునకు నుపవాయువు గనుక, నాత్మయని చెప్పగూడదు.

3. కృకురవాయువు - రక్తవర్ణము కలిగి నాసికాగ్రమునందుండి, తుమ్మించుచుండును, వీనికి నధిదేవత విశ్వయోని. ఇది వ్యానవాయువునకు నుపవాయువు గనుక, నాత్మయని చెప్పగూడదు.

4. దేవదత్త వాయువు - స్ఫటిక వర్ణము గలిగి గుహ్యనేత్రస్థానముల యందుండి, యావులింతలు వచ్చునట్లు చేయుచుండును. వీనికి నధిదేవత అజుడు. ఇది యుదానవాయువున కుపవాయువు గనుక, నాత్మయని చెప్పగూడదు.

5. ధనంజయ వాయువు - ఇంద్రనీల వర్ణము కలిగి బ్రహ్మస్థాన మందుండి కర్ణరంధ్రములలో దశవిధ నాధములు జేయుచు,

Scanned by TapScanner

మరణ కాలమునకు ముందుగా నిర్ఘోషమయిపోవును. వీనికి నధిదేవత జయుడు. ఇది సమానవాయువునకు నుపవాయువు గనుక నాత్మయని చెప్పగూడదు.

1. మనస్సు - కంఠస్థాన మందుండి సంకల్ప వికల్పములను జేయుచుండును. వీని కధిదేవత చంద్రుడు. ఇది యాకాశవాయువుల సమ్మిళితమైన యంతరింద్రియముగాని, నాత్మయని చెప్పగూడదు.
2. బుద్ధి - ముఖస్థానమందుండి మనస్సు చేయునట్టి సంకల్ప వికల్పములను నిశ్చయించును. వీనికి నధిదేవత బృహస్పతి. ఇది యాకాశాగ్నుల సమ్మిళితమైనది. గనుక నిదియును నంతరింద్రియముగాని యాత్మయని చెప్పగూడదు.
3. చిత్తము - నాభిస్థానమందుండి మనస్సు చేయునట్టి కార్యములను జింతించుచుండును. వీనికి నధిదేవత క్షేత్రజ్ఞుడు. ఆకాశ ముదకముతో గూడుట వలన సంభవించిన యంతరింద్రియమే కాని, యాత్మయని చెప్పగూడదు.
4. అహంకారము - హృదయస్థాన మందుండి, యభిమాన పడుచుండును. వీనికి నధిదేవత రుద్రుడు. ఇది యాకాశము పృథ్వితో గూడుటవలన జనితమైన యంతరింద్రియమేగాని యాత్మయని చెప్పగూడదు. స్థూల దేహము నీవుకాదు. సూక్ష్మదేహము నీవుకాదు, కారణ దేహము నీవుకాదు. ఈ మూడు శరీరములకు విలక్షణమైన యాత్మయే నీవు. జాగ్రదవస్థ నీవు కాదు స్వప్నావస్థ నీవు కాదు. సుషుప్త్యవస్థయును నీవు కాదు. ఈ మూడవస్థలకు సాక్షిగాను తెలివిగానుండు జ్ఞానస్వరూపమే నీవు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనం

Scanned by TapScanner

దమయ కోశములు నీవుకాదు ఈ పంచకోశములకు విలక్షణము గాను దెలివిగానుండు సచ్చిదానంద స్వరూపమే నీవు.

శ్రోత్రం, త్వక్కు, చక్షువు, జిహ్వా, ఘ్రాణము, వాక్కు - పాణి - పాదము - గుహ్యము - పాయువులనెడు నింద్రియములును, బృథ్వీజలము. అగ్ని, వాయువు, ఆకాశములును, శబ్ద - స్పర్శ - రూప - రస - గంధములును, జ్ఞాత మనోబుద్ధి చిత్తాహంకార ములును నీవు కాదు. ఈ యిరువదియైదు తత్వములును నీవు కాదు. ఇరువది యారవదియైన జ్ఞానమే నీవు. నీవే పరమాత్మవు. అట్టి పరతత్వమైన యాత్ముడవే నీవు. ప్రాణపాన వ్యానోదాన సమానములును నీవు కావు. వీని వ్యాపారములును నీకు లేవు. వచన, దాన, గమన, విసర్జన, అనందములును నీవు కావు. త్వక్చర్మమాంస రుధిర మజ్జాస్థ్యమేధ్యములును, సత్వరజస్తమో గుణములును నీవు కావు. వీనికన్నింటికిని విలక్షణముగాను బరిపూర్ణముగాను దెలివిగాను నుండు నాత్మస్వరూపమే నీవు. ఈ నామరూపాత్మికమైన విశ్వము, బ్రహ్మమునకంటె వ్యతిరిక్తమయినది కాదు. ఎటువలెననిన - మృత్తువినా ఘటమెట్లు లేదో, బంగారము వినామకరకుండలము లెట్లు లేవో, తంతులువినా పటము లెట్లు లేవో, యినుము వినాఖడ్గమెట్లు లేదో, యటువలె బ్రహ్మము వినా-ప్రత్యగాత్మ లేదు. ఆ బ్రహ్మస్వరూపమే నీవు. నీవే బ్రహ్మస్వరూపము.

ప్రశ్న :- ఇందుకు నేమయిన బ్రమాణమున్నదా?

ఉత్త :- ఋగ్యజుస్సామాధర్వణ వేదములు నాలుగును, నుపరి నాలుగు మహావాక్యములును, స్పష్టముగా బోధింపుచున్నవి. ఎట్లనిన 'ప్రజ్ఞానంబ్రహ్మ, యను ఋగ్వేదమహావాక్యము, ప్రఅనే-ప్రకృతి

అనగా-మాయ మాయ, యనగా నహంకారమును తెలివికి గనుపించు ప్రపంచము సత్యమని తోచుటయు, జ్ఞాన మనగా నంతర్బాహ్యములను వాఙ్మనో గోచరమైనది. 'యద్దృశ్యం తన్నశ్యం యత్కృతం తదనిత్యం.' అని ప్రమాణమున్నది గనుక, నీ కనుపించు వాక్కున జెప్పబడు సర్వమును ననాత్మ యనియును, నజ్ఞాన మనియును విడిచి పెట్టి, యొక్క గురువాక్యము నందె యేకచిత్తముగా నిలిచిన దేజ్ఞానమనియును, నాత్మయనియును నాత్మానాత్మల రెంటిని దెలిసికొనిన దానే బ్రహ్మమని ప్రమాణమున్నది గనుక, సమస్తజగత్తు బ్రహ్మమని భావన చేసినదే గురుదీక్ష.

"అహంబ్రహ్మాస్మి" యను యజుర్వేద మహావాక్యము. అకార-ఉకార-మమకారములను మూడు వర్ణములు కూడినదే ప్రణవమని యును, శబ్దదృష్టి సంకల్పములను సద్గురుడు చెప్పిన స్థానమందు నైక్యము చేయుటయే యోగమనియు, అ కారమైన యర్ధమాతృక, యాధారచక్రమందుబుట్టి, పరాపశ్యన్తిమధ్మమ వైఖరీచతుర్విధ శబ్దములను దాటి యహం, బని సుషుమ్నను నెక్కి, తన స్థానమందు నైక్యమవును గనుక, అహంబ్రహ్మాస్మి, యనుట. అహమనగా నేనను మాట నేననగా పరబ్రహ్మ స్వరూపమనియును, నిదే యీశ్వరుడ నియును, విశ్వమంతయు భరించినందున నీశ్వరనామమనియును, మంగళప్రదమైన తెలివినిచ్చుట చేత శివుడనియును నా తెలివి నేత్ర మధ్యమందునున్నదనియును ॥స్మృతి॥ **"విశ్వం చక్షురు తంతస్మిస్సర్వం ప్రతిష్ఠితం"** అని ప్రమాణమున్నది గనుక దన నేత్రములయందు గనుపించు సర్వచరాచర ప్రపంచము, నీశ్వరుడని గురువు చెప్పిన, యద్వితీయ దీక్షను భావించినదే యజుర్వేదార్థము.

ఈ యర్థమభ్యాసమైన దానే బ్రహ్మమని 'అహం బ్రహ్మాస్మి' యని పలుకుట.

తత్వమసి–అను సామవేద మహావాక్యము "తత్వమసి ఇత్యభేద వాచకం – యేజపన్తి తేశివసాయుజ్య ముక్తి: భాజాభవన్తి" అని ప్రమాణము గురువునందు గ్రియాద్వైతము, ప్రపంచమందు ద్రవ్యాద్వైతము. ఆత్మయందు భావాద్వైతము, గలిగినదే యభేదవాచకము. ఇదే యెల్లప్పుడును ధ్యాస కలిగియుండ వలయును. తత్–అనగా నిరాకార స్వరూపము త్వం–అనగా హంసస్వరూపము అసి–అనగా నిరాకారమందు దిరుగ గలియుట ఈ ప్రకారము సమస్త జగత్తు నైక్యమవుచున్నట్లు తెలిసి, భ్రమ విడుచుటే జీవేశ్వరులకునై క్యానుసంధానము. జీవుడనగా బ్రపంచము సత్మమనే భ్రమ. ఈశ్వరుడనగా నా సర్వప్రపంచము ననాత్మయని యేకత్వసిద్ధి గలిగినదే యీశ్వరత్వము కాబట్టి, సర్వ ప్రపంచమును నిరాకారమే నేనన్న జ్ఞానము కలిగితే నభేద జ్ఞానమ నియు భేదమే యజ్ఞానమనియు సమస్త శాస్త్రములయందు జెప్ప బడ్డది. కాబట్టి జీవేశ్వరులకు నైక్యమయ్యే పరిణమించును.

'అయమాత్మబ్రహ్మ' అను నథర్వణ వేదవాక్యము, అయం – అను శబ్దమునకొక పిండమందే తాత్పర్మము గనుక, నండపిండ బ్రహ్మాండ ములకు భేదములేక, యభేదనిష్కర్షగా నీ వాక్యము పలుకును. అండమనగా గ్రుడ్డు. పిండమనగా సమస్త దేహములయందు గారణమైన హంసస్వరూపము – బ్రహ్మాండమనగా – బదునాలుగు భువనములు తన కుక్షియందు నిముడ్చుకొని తాను విలక్షణమై సర్వసాక్షియై యున్న పరమాత్మ వీటికి నేకత్వసిద్ధి యేలాగనిన, బ్రహ్మాండము వలన బిండాండము; పిండాండము వలన

నండాండము; అండాండము వలన బ్రహ్మాండము! బ్రహ్మాండము వలన ననంతకోటి బ్రహ్మాండములు, అనంతకోటి బ్రహ్మాండములవలన – నండాండము; అండాడము వలన సమస్త జగదుద్భవము సమస్త జగత్తు–నండములోను, నండము పిండములోను, పిండము బ్రహ్మాండములోను నైక్యమగుచున్నది. ఈ నాలుగు మహావాక్యముల యర్థానుభవము కలిగినవారే జీవన్ముక్తులు. ఇందుకు సంశయములేదు.

ఇది శ్రీమద్వేదాంత సారుండను, స్వయంప్రకాశ పరిపూర్ణుండును,
నిరాలంబుండును, నశరీరుండును, ప్రకృతిద్వయదోషరహితుండును,
సద్గురుస్వామియునగు పులహరి – ఫీరుదాసుగారి కటాక్షంబున
దిరుచునాపల్లి – రంగుస్వామిచే నాంధ్రంబున వచన
కావ్యముగా రచియింపబడి, యచల గురుండగు,
పోకల – శేషాచలాహ్వాయునిచే బరిష్కరింపంబడిన,
ముక్తిప్రదాయిని యను గురుశిష్య
సంవాద రూపకంబగు భక్తి, యోగ,
జ్ఞానమార్గములు

సమాప్తము.

Scanned by TapScanner

అచలమార్గము

ప్రశ్న:- స్వామీ! శరీరములు మూడని సెలవిచ్చితిరి. అవి యీమూడేనా? ఇంక నేమైన నున్నవా?

ఉత్త :- బిడ్డా! తానని చెప్పిన నాలవ శరీరమే - మహాకారణ మనియును, హిరణ్య గర్భుడనియును, నెఱుకనియును జెప్పంబడును. యెఱుక చేతనే యచల బ్రహ్మమును నెరుగవలయును.

ప్రశ్న:- స్వామీ! దయతో నచల పరిపూర్ణ మెటువంటిదో - యానతియ్యవలెను?

ఉత్త :- బిడ్డా! శ్రద్ధాసక్తుడవై వినుము అఖండమై యప్రమేయమై యాదిమధ్యాంత రహితమై తమమును, దేజమును గాక, మహావ్యాపకమై, స్థిమితమై, యనాఖ్యమై, యనభివ్యక్తమై, యవాచ్యమై, యచింత్యమై, నిర్వికల్పమై, నిష్ప్రపంచమై, యానందాతీతమై, సర్వశబ్దశూన్యమై, సనాతనమై, యప్యరంతమై, హేతుదృష్టాంత వివర్జితమై, సర్వాదిష్ఠానమై, యీశ్వరావ్యాకృత హిరణ్యగర్భ విరాట్ప్రాజ్ఞ తైజస విశ్వరూప చిత్ప్రతి బింబ బింబ ప్రతిబింబ భావకల్పనావిరహితిమై, పరిపూర్ణమై, యెప్పటికిని ముప్పులేక, కదలక, మెదలక, చెదరక, బెదరక, తప్పొప్పులెఱుగక, యాద్యంతములు లేక, రాకపోకలు లేక, వాదభేదము లెఱుంగక, ఖేదమోదంబులను బొందక, నామనీమములు లేక, నాదబిందులుగాక, వర్ణాశ్రమములు లేక, జాతిభేదములు లేక, కులగోత్రములు లేక, చావుపుట్టులు లేక, భక్తి కర్మలు లేక, యోగజ్ఞానములు లేక యండపిండములు గాక, తేపు మాపులు లేక, చూపు రూపులు గాక, చింతవంతలు లేక, మాతాపితృలు గాక, కళత్రమిత్రులు లేక, జీవేశ్వరులు గాక, యన్నింటిని మిగిలి,

Scanned by TapScanner

లావు సన్నములు గాక ప్రసన్నముగా నున్నది. ప్రేమతో బులహరి - ఫీరోజీ దేశికుదు తన శిష్యుడగు, తిరుచునాపల్లి - రంగస్వామికి జూపించిన యచల మిది. ఇట్టి యచలమందు నెఱుక యెన్నడును బుట్టనేలేదు. ఇందుకు సమ్మతము॥ "అంత:పూర్ణో బహి:పూర్ణ: పూర్ణకుంభ ఇవాంభసి। అంతశ్శూన్యో బహిశ్శూన్య: శూన్యకుంభ ఇవాంబరే॥" అని స్మృతుల చేతను, "పూర్ణామద: పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదీరితం । పూర్ణస్య పూర్ణామాదాయ పూర్ణమేవా వశిష్యతే ॥ యతో వాచా నివర్తంతే అప్రాప్య మనసాసహ॥ అవేద్య, మసంగ, మబోధ్య, మబాధ్య మకర్మ మప్రమేయ, మద్వయ మనిష్క్రియం, పరమాకాశ మచలం సర్వదాభాతిపూర్ణం ॥ అనన్వమస్థూల మహ్రస్వ మదీర్ఘ మజమవ్యయం । అరూప గుణవర్ణాఖ్యం తద్బ్రహ్మేత్య వధారయేత్ ॥ నిర్గుణో నిష్క్రియో నిత్యో । నిర్వికారో నిరంజన: । నిరాకారో నిరాధారో నిత్యముక్తోస్మి నిర్మల: ॥" అని ఇట్టి స్మృతి శ్రుతుల చేత బ్రసిద్ధముగా జెప్పబడుచున్న సర్వపరిపూర్ణమైన యీనిర్బాహ్యమే - యచల బ్రహ్మము - అని సద్గురుని వలన సూచింపబడుచున్నది.

ప్రశ్న :- స్వామీ! ఎఱుక యనగా నెటువంటిది?

ఉత్త :- బిడ్డా! ఎఱుకను వివరింతుము. ఏకాగ్రచిత్తుండవై వినుము. ఎఱుక యనగా సత్యజ్ఞానానంద స్వరూపమైనది. ఇది స్వయంభువు. ఇదే సర్వసాక్షి, ఇదే యాపోజ్యోతి, సమస్తమయిన వారును నీ జ్యోతి స్వరూపమునే బ్రహ్మ మనిరి. ఇదే యక్షర పరబ్రహ్మము. ఇదే కళాస్వరూపము. ఇదే మూలమాయ ఇదే విరాట్టు. ఇది సగుణరూపము గనుకను, రాకపోకలు కలిగి యుండుటచేతను, నిది పూర్ణము కాదు. ఇదే సత్యమైతే, దీనివలన నగు కల్పన

Scanned by TapScanner

యావత్తు సత్యమవును. ఇది యన్నింటికి మూలమైనప్పటికిని దీనికి మూలములేదు. కనుక మూలము కాదు. అమూలము కాదు ఉత్పత్తి కాదు. అనుత్పత్తి కాదు. ఆది కాదు. అనాది కాదు. జ్ఞానము కాదు. అజ్ఞానము కాదు. రూపము కాదు. అరూపము కాదు. అన్నింటికి మూలమదే గాని దానికి మూల మెక్కడను లేదు. కనుక మూలము కాదు. ఉన్నట్టు తోచుచున్నది గనుక, నమూలము కాదు పుట్టినట్టు కానరానిది గనుకను, సర్వాభావము గనుకను, నుత్పత్తికాదు. ఉన్నట్టు తోచుచున్నది గనుక ననూత్పత్తి కాదు. జ్ఞానమును గూడ నెఱుగుచున్నది గనుక జ్ఞానము కాదు. అంతట విచారించినది లేదు గనుక వ్యాపకము కాదు సమస్తమందు లేకున్న నున్నట్టు తోచుచున్నది గనుక, నవ్యాపకముకాదు అభావము కాదు. ఇదే పులహరి ఫీరోజి దేశికుండు తిరుచునాపల్లి రంగస్వామికి జూపించి విడిపింపజేసిన యెఱుక. వేపకాయకు దీపు లేనట్టు పరిపూర్ణము నందు నెఱుక లేదు. మాయ యెఱుక యేకాలమందు బుట్టలేదు, పుట్టింపబడనులేదు. యామా – సా – మాయా – యనియుండగా మాయకు నిగ్రహ మెక్కడిది? మాయ దబ్బర గదా! మాయ యనగా లేనిదిగాదా! మాయలేకున్న మాయాకార్యములు నిజమా? కాదు. కాబట్టి గొడ్రాలికి నే కాలమందును బిడ్డలు లేనట్లు లేని యెఱుక యచల పరిపూర్ణమునం దేకాలమందును బుట్టనేలేదు. పుట్టిన దనుట దబ్బర సత్యమందు సత్యమే పుట్టవలయును గాని, యసత్యము పుట్టునే పుట్టదు. పుట్టినదని చెప్పుట భ్రాంతియే గాని నిజము కాదు. కనుక నిది గురు కృపచేత దెలుసుకొని దహించుటయే పరమముక్తి. ఇదే స్వరూప రహితస్థితి.

ప్రశ్న :- ఈ యెఱుక యేది? ఏలాగున వచ్చినది?

ఉత్త :- నీటిలో వడగండ్లు బుగ్గలు తమకుదామే వచ్చి, పెరిగి యేలాగు నశించి పోవునో యాలాగుననే చలించక యున్న పరిపూర్ణ మందుండి యెఱుక తనకుదానే వచ్చి తనకుదానే పెరిగి తనకుదానే నశించిపోవును. ఎవరి పేరంటమును లేదు. అది ఏలాగనిన గలలో వచ్చిన శరీరమును నెవరు రప్పించిరి? తిరిగి ఎవరు కొనిపోయిరి? కనుక గర్తలేదని తెలిసికొనుడు.

ప్రశ్న :- పరిపూర్ణమున్నది యన్నట్టులుండగా నడిమంత్రపు టెఱుకకు నిట్టిమిడిచి పాటెందుకు?

ఉత్త :- ముందుకు వచ్చిన చెవుల కంటె వెనుక వచ్చిన కొమ్ములు పొడుగన్న ట్టును, మధ్య నైశ్వర్యము వచ్చిన మిట్టిపడిన చందమన్నట్టునున్నది. సర్వదేశ, సర్వకాల సర్వావస్థలయందు జలించక యొక్క తీరుగా నుండు బట్టబయలందు నెఱుక పుట్టనేలేదు. పుట్టిన దనుట దబ్బర. ఎఱుక విడిచిన పుణ్యపురుషులకు జట్టువలె గదల కుండిన బట్టబయలందు నెఱుక పుట్టనే లేదు. దీనికి సమ్మతి.

శ్లో॥ **రక్షకోవిష్ణురిత్యాది । బ్రహ్మాసృష్టేస్తుకారణం ।**
సంహారో రుద్రయిత్యుక్తం । సర్వంమిథ్యేతి నిశ్చయమ్॥

ప్రశ్న :- అట్లయితే - పదునాలుగు భువనములును, సకల వేద శాస్త్ర పురాణాదులును నెవరు కల్పించిరి?

ఉత్త :- ఎఱుక తన్నెవరు లేదందురో యని తాను సత్యమని నిరూపించుకొనుటకు, సమస్తమైన వేదశాస్త్ర పురాణేతి హాసములను గట్టుదిట్టములుగా గల్పించుకొనిన యెఱుకకు మూలము లేక, తనకుదానే వచ్చి, మూలము లేని పుత్రమిత్ర కళత్రాదులతో నానందించి, తన జాలమునకు దానే సంతోషించుచు, ముందర

దానికి ముచ్చట పడుచు వెనుకటి దానికి వేడుక పడుచు, దనకు దానే మటుమాయముగా బోవును. అట్టి యెఱుక యుండిన నుండనిమ్ము, పోయిన బోనిమ్ము, నమ్మరాదు, లేదనే నమ్మవలెను. లేదనిన నందటికి నిష్ఠురము. స్వప్నములో సంభవించిన పుత్రసంపత్తి మేలుకొనిన గానంబడునా? కానంబడదు. అందుకు దు:ఖపడిన మాత్రాము వచ్చునా? అలాగే వేఱేతోచు దేహములకు బోవునో యుండునో యను విచారముతో బనియేమి? వంధ్యా పుత్రుని నిమిత్తము దు:ఖపడవలెనా లేని దేహములకు దు:ఖపడుటెందుకు? అలాగే తానులేదు గనుక, తాను చేసిన కృత్యములును లేవని తెలిసికొనవలెను. ఇది ముమ్మాటికి నిశ్చయము.

శ్లో॥ **"అశరీరం సర్వదాస్తి । శరీరం రహితంసదా ।**

ఇదమేవ సదోముక్తి: । అన్యథా భ్రమకారణమ్॥"

ప్రశ్న:- నామరూపాత్మకమైన విశ్వమిట్లు కనుపడుచుండగా నబద్ధమని యేలాగున భావింప వచ్చును?

ఉత్త :- "బ్రహ్మాస్సత్యం జగన్మిథ్యా" యను వేదప్రమాణము వలన బ్రపంచము సత్యము కాదు.

ప్రశ్న:- జగత్తు మిథ్య యన్నప్పుడు, జగత్తు సత్యమైన నే తప్పు మిథ్యయను ప్రతీతి కలుగదు. మిథ్యాశబ్దమునకు లేదను నర్థము లోకములో సత్యమను వస్తువునకు లేదను ప్రతీతి యున్నది గాని యసత్యమునకు నట్టి ప్రతీతిలేదు?

ఉత్త :- జగన్మిథ్యా యను దానికి జగత్తునందు బారమార్థిక సత్యత్వములేని యర్థము కాని, యత్యంతాభావమని యర్థము కాదు. వ్యవహారిక సత్యత్వమున్నది. కాబట్టి జగన్మిథ్యా యనుటకు బాధకములేదు. ఈ ప్రపంచ మింద్రజాలము వంటిది. ఎట్లనగా నింద్రజాలకుడు

Scanned by TapScanner

తన జాలమును గావించినప్పుడు, తనవద్ద లేని వస్తువులను సంకల్ప మాత్రమున రప్పించి, యితరులకు గనుపఱచినప్పు డావస్తువులన్నియు సత్యముగానే కనుపడి, తర్వాత నెటువలె గనుపించవో యటువలెనే యీ ప్రపంచమును నప్రమాణము; అయుక్తము: అనిశ్చితము; అసత్యమైనది గనుక, ప్రపంచరూపముగా గనుపడుచున్నదే గాని సత్యముగా గనుపించుట కాదు. ఇంక నెట్టిదనిన స్వప్నమువంటిది. ఏలాగనిన స్వప్నావస్థయందు బ్రత్యక్షముగా గనుపడిన సమస్త శరీరములును, బ్రపంచమును, జాగ్రత కలిగిన పిమ్మట నెటువలె గనుపించవో యటువలెనే పామరులైన జనులు భ్రాంతి చేత బ్రపంచమను కలగనుచున్నారు. సత్పురుషులైన వారు సద్గురూపదేశ మను జాగ్రత గలవారై భ్రాంతివలనైన యీ ప్రపంచము సత్యము కాదని నమ్ముచున్నారు. ఎటువలెననిన నెండ మావులయందు జలమును శుక్తియందు రజతమును, రజ్జువు నందు సర్పమును, దారువునందు బురుషుడును, నాకాశమందు నీలపీతాదులును, లేకపోయినను, నున్నవను భ్రాంతి యేలాగు తోచుచున్నదో యాలాగుననే లేని ప్రపంచమును భ్రాంతితో నున్నట్టు తోచుటకాని నిజముగాదు. ఇట్టి యసత్య ప్రపంచము సత్యమని చెప్పుట యెట్లున్న దనిన వంధ్యాసూనుని చేత నొక మనుష్యుడు చంపబడెనన్నట్టును, గుందేటి కొమ్ముల వలన సింహము చంపబడిన దన్నట్టును, నొకమానవు డెండమావులలో నీళ్లు త్రాగి దాహము తీర్చుకొనెనని చెప్పినట్టును నొక మనుష్యుడు మేక మెడయందుండిన చండ్లలో బాలుత్రాగి తన యాకలి దీర్చుకొనెనని చెప్పినట్టును, గాకి చిలుక వలె బలికిన దన్నట్టును, సూర్యుడు చంద్రునివలె నున్నాడన్నట్టు, నేనుగును

గుఱ్ఱమును నొక్కతీరుగానే యున్నది యన్నట్టును, సూచింపబడుచున్నవి. గనుక, నీపైన జెప్పబడిన వన్నియు నెంత నిజమో - ప్రపంచము సత్యమని చెప్పుట యంత నిజము. అదియునుంగాక, పరబ్రహ్మము తేజోమయమనియు, మాయ తమోమయ మనియు వేదములయందు జెప్పబడియున్నది. అయితే నీ రెండును నేకకాలమందున్నవని చెప్పుట యసంభవము. అది యెటువలెననిన సూర్యునియందు జేటయంత చీకటి యున్నదని చెప్పినట్టుగానున్నది. ఇట్టి యసంభవ మెచ్చోటనుగానము. కాబట్టి మాయ నిజము కానిది. ఉనికిపట్టు లేనిది. ఇట్టి లేనిమాయవలన జగము లెటుల బుట్టెను? గనుక సత్యమందు సత్యమే పుట్టవలయును గాని యసత్యము పుట్టదు. కాబట్టి సత్యమైన బ్రహ్మయందసత్యమైన ప్రపంచము పుట్టనేలేదు. పుట్టించబడను లేదు. మనుష్యులకు మనుష్యులును, సింహములకు సింహములును, నేనుగులకు నేనుగులును, దోమలకు దోమలును, గుక్కలకు గుక్కలును బుట్టునే గాని, యొక జాతియందు మఱియొక జాతి పుట్టదు. కనుక సత్యమైన బ్రహ్మమందు నసత్యమైన ప్రపంచము పుట్టినదనుట మిథ్యావాదము. గొడ్రాలికి నేకాలమందును బిడ్డలు పుట్టనేలేదు. నామరూపాత్మకమై గుణసహితమైన యీ ప్రపంచము, నామరూపరహితమైన నిర్గుణ బ్రహ్మమందు నెట్లు పుట్టును గనుక పుట్టనేలేదు. అజ్ఞానులకు బుట్టినట్లు తోచును. జ్ఞానుల కట్టుతోచదు.

ప్రశ్న :- అయ్యా! లేని ప్రపంచ మజ్ఞానులకు మాత్రమెందుకు దోచవలెను?

ఉత్త :- అజ్ఞానులు ప్రపంచమును సత్యముగా దలచుట తప్పుకాదు. అందువలన సత్యమనుటకును వీలులేదు. అజ్ఞానమెంత పర్యంత

Scanned by TapScanner

ముండునో యంతవఱకును బ్రపంచము సత్యముగానే తోచినను, నజ్ఞాన నివృత్తులగు పెద్దలకు సత్యమని తోచదు. స్వప్న మెంత వఱకు జరుగుచుండునో యంతవఱకు దానికి స్వకాలము. అజ్ఞాన మెంతవరకుండునో యంతవఱకు దానికి స్వకాలము కాబట్టి స్వప్నము యొక్క స్వకాల మందు స్వప్నము సత్యముగానే తోచినట్లు దీని స్వకాలమైన యజ్ఞానమున్న వఱకు నిది సత్యముగానే తోచుట యాశ్చర్యము కాదు. ప్రబోధ కలుగుట చేత స్వప్న కాలము పోగా, స్వప్న మబద్ధమైనట్టు, లాత్మ ప్రబోధము కలుగుటచేత, నజ్ఞానముపోగా, నా ప్రపంచమబద్ధమవునుగాని, యజ్ఞానులకు బ్రపంచ మబద్ధముగా దోచలేదు గనుక నీ హేతువు చేతనే ప్రపంచము సత్యమనుటకు వీలులేదు. జ్ఞానుల యొక్క యనుభవమే సత్యము.

ప్రశ్న :- అజ్ఞానులకు బ్రపంచముండుటయును జ్ఞానులకు లేకుండుటయు నెట్లు? లోకములో నొకవస్తు విద్దఱికి నొక్కరీతిగానే కనుపడును గాని, యొకనికి నొకవిధముగాను, రెండవ వానికి మఱియొక విధముగాను గనుపడునా? యని సందేహము కలుగుచున్నది గాన, నీ సంశయచ్ఛేదమును జేయగోరెదను.

ఉత్త :- బిడ్డా! ఇద్దరు బాలకు లాటలాడుకొనుచుండగా వారిలో నొకడాత్మ ప్రదక్షిణము చేసుకొనుమాడ్కి వేగముగా గిరిగిర దిరుగసాగెను. ఈ యాటకు నల్లిబిల్లియని తిరుగుట పేరు. ఇట్లు తిరుగు బాలునకు, వృక్ష స్తంభ గృహాదులు తిరుగుచున్నట్టు కనుపడి రెండవ బాలకునితో సమస్త పదార్థములు తిరుగుచుండుటను జూడుమని చెప్పగా, లేదు. ఎచ్చటి వచ్చటనే యున్నవని రెండవ వాడు చెప్పను. ఇట్టివి లోకమందు గనియున్నారము అల్లిబిల్లి తిరుగుట చేత దృక్కు

చలించియున్న బాలునకు సమస్త వస్తుజాలం చలించుచున్నట్టు కనుపడుట సత్యమే. నిలిచియున్న బాలకునకు, నవియన్నియు నిలిచియున్నట్టు కనుపడుటయు సత్యమే కావున, నజ్ఞానికి ప్రపంచ ముండుటయు, జ్ఞానికి లేకుండుటయు గలుగవచ్చును. అజ్ఞాని చంచలమైన మనోవ్యాపారము గల వాడుగాన, నతనికి ప్రపంచ మున్నదని తోచవచ్చును. చంచలము లేనివాడు గనుక జ్ఞానికి లేకపోవచ్చును.

ప్రశ్న:- స్వామీ! తమ రానతిచ్చిన రీతిని జూడగా ప్రపంచము మానసికమని తోచుచున్నది, అందు కేమయిన దృష్టాంతమును సెలవీయగోరెదను?

ఉత్త :- ప్రపంచము మానసికమే కావున నమనస్కులకు లేదు. దృష్టాంతమును జెప్పెద శ్రద్ధతో వినుము. మనస్సును సుషుప్తి మ్రింగినప్పుడేమి యుంగనబడక, తిరిగి మనస్సించుక తోచు వఱకు, మనమితడతడని సమస్తము తోచుచున్నది. సూర్యుడుండు వఱకు సూర్యకిరణములు తోచి సూర్యుడస్తగతుండైనచో సూర్యకిరణములు తోచక పోవుటను బట్టి, యవి సూర్యుని తాలూకే యని యూహిం చునట్టు, మనస్సుండగా దోచు జాగ్రత్స్వప్న ప్రపంచములు, మనస్సు లేనప్పుడు లేవుగాన, నవి మానసికములని చెప్పుటకు సందియములేదు.

ప్రశ్న:- అట్లయినచో మనస్సు యొక్క నిజ స్థితిని సిద్ధాంతము సేయగోరెదను?

ఉత్త :- మనస్సే మాయ గనుక, మాయను నీ విట్టిదని సిద్ధాంతమును జేసితివేని మనస్సును నేను సిద్ధాంతము చేసెదను. శిష్యుడు॥ మాయలేనే లేదు; గురువు॥ మనస్సునునదే ప్రకారము లేదు.

Scanned by TapScanner

ప్రశ్న :- ప్రపంచము సత్యమని చెప్పినందు వలన బాధయేమి?

ఉత్త :- అట్లు చెప్పినందు వలన నధోగతి పాలగుదురు నశింతురు ఏలాగనిన నెండమావులను జూచి నీళ్ళను భ్రాంతి చేత మిక్కిలి డప్పిగొని పరుగు బాఱి నశించిన లేడివలెనే నశింతురు.

ప్రశ్న :- ప్రపంచ మసత్యమైనట్టులయితే ననుభవమెట్లు కలుగును? హా! ఇది చిత్రము కదా!

ఉత్త :- సరే, స్వప్నమందొక యౌవన స్త్రీ వచ్చినట్టును, దానితో సరసము లాడి, సల్లాపములు చేసినట్టును, దానితో సంభోగించినట్లును, స్వప్న మాయెను గదా! మెలకువ గలిగిన తర్వాత జూడగా బ్రత్యక్షముగా స్ఖలనమైనదే గాని యా స్త్రీ కనుపించలేదు. గనుక నీ ప్రపంచము యొక్క యనుభవమును నటువంటిదేయని తెలుసుకోవలయును. కాబట్టి, లేని ప్రపంచము భ్రాంతిచే దృఢముగా నున్నట్టు కనుపడుట వలననే యిన్ని విధములుగా జెప్పవలసి వచ్చినది. లేనిది యున్నట్టుగా దోచకపోయిన బోదతో బనిలేక యేయుండును. పొరబాటు లేక పోయిన సవరణతో బనిలేదు. ఇంకొక దృష్టాంతము గలదు. ప్రపంచము సత్యమైన గాఢసుషుప్తిలోగూడ గనుపించవలెను గదా? అట్టి సమయములో నెంతమాత్రమును గనుపించలేదు గనుక నిదియే యనుభవముగా నెంచవలయును.

ప్రశ్న :- అన్ని యవస్థలలో గనుపడునదియే సత్యమన్న యెడల, జాగ్రత్స్వప్న సుషుప్త్య వస్థలయందు గానరాని యా బ్రహ్మము మాత్ర మెటుల సత్యమగును?

ఉత్త :- అట్లుకాదు, బ్రహ్మము సర్వకాల సర్వావస్థలయం దుండునదియై సత్యంబై నను, మనకు గల యవిద్యా సంపర్క మనునుపాధిచే

గానరాకున్నది గాని, స్వతస్సిద్ధముగా లేకపోలేదు. పుట్టినది భ్రాంతియేగాని జగముకాదు ఇది కోటి పర్యాయములకు నిజము.

ప్రశ్న:- పదునాలుగు భువనములను, సకల వేదశాస్త్ర పురాణేతిహాస ములను, మాయ కల్పించినదని చెప్పితిరి గదా? మాయ యెలుక జడము గనుక, దానికి సృష్టిశక్తి యేలాగున గలిగినది?

ఉత్త :- పరిపూర్ణ సాన్నిధ్యము వలన మాయ యెలుకకు సృష్టిశక్తి కలిగినది యేలాగనిన సూర్యోదయభాతి సహాయమువలన సమస్త జీవరాసులకు జలించుటకు నేలాగు శక్తికలదో యటువలెను, నాత్మ సాన్నిధ్యమువలన జడములైన యింద్రియములకు జలించుట కేలాగు శక్తికలదో యటువలెను, బరిపూర్ణ సాన్నిధ్యము వలన మాయ యెలుకకు సృష్టిశక్తి కలిగినదిగాని పరిపూర్ణము కర్తృత్వభోక్తృత్వాదులు లేనిది గనుక మాయ యెలుక యొక్క చావు పుట్టుకల నెలుగదు.

ప్రశ్న:- అయితే శూన్యమైన యెలుక పుట్టినదనియు బెరిగినదనియు, బోయినదనియు నేల చెప్పవలసి వచ్చినది?

ఉత్త :- యక్ష రాజధానికి రాజుగా నుండు స్థాణుపురుషుడు వేటకు బోయి, కుందేటి కొమ్ము పోటువలన మృతినొందినందున నా పట్టణము నకు వేఱొక రాజును నేర్పఱచ దలచి, మ్రాను గజమయిన పట్టపు టేనుగును శృంగారించి, యెండమావులందుండు నుదకముతో బూరింపబడ్డ సువర్ణ కలశమును, నాకాశ పుష్పమాలయును నీయగా, నాయేనుగా పట్టణములకు రాజుగా నుండదగిన వాడనియెంచి, యా వంధ్యాపుత్రుని శిరస్సునందా కలశోదకము నభిషేకించి, యాకాశ పుష్పమాలను గంఠమునందు ధరియించి, యతనిందన మస్తకమునందు గూర్చుండబెట్టుకొని తీసికొనిపోగా,

నిస్సంగులకు మాత్రమే కనుపింతురు. సూర్యుడు మలిన సహితమైన బురదయం దెట్లు కనిపించడో, యావిధముగానే యశరీరులును నరిషడ్వర్గములతో గూడుకొని యుండెడి మలినాత్ములకు గనుపించరు గాన, గురువు శరీరము లేనివాడని చెప్పబడును.

ప్రశ్న :- గురువునకు శరీరము లేకపోయిన నేలాగున బోధించును?

ఉత్త :- గురువొకడు; శిష్యుడొకడు; గురువు బోధించినట్టును శిష్యుడు విన్నట్టును దోచు భిన్నభావము భ్రమచేతనే కాని యదార్థము కాదు అది యెట్లనిన శిష్యుని యొక్క స్వప్నమందు గురువు వచ్చి మాట్లాడిన సమాచారము గురువునకు దెలియదనుట యెట్లాశ్చర్యము కాదో యాలాగే గురు శిష్యులకు జరుగు బోధ గురు వెఱగడనుట వింతగాదు. ప్రపంచమును, శరీరమును, స్వప్నము వంటివిగాన, లేదని, గురువు వెంటనే యెఱిగి మేల్కని యున్నాడు శిష్య దెఱుగడు కాబట్టి ప్రపంచమును శరీరమును సత్యము గానే భావించి కలగనుచున్నాడు. గురుశిష్యులకు గలుగు సంవాదము శిష్యుని కలగాని, గురువు కలకాదు. గురుడొకడు తాను నొకడు నున్నట్టును, నతడు చెప్పుచున్నట్టును, దాను వినుచున్నట్టును, శిష్యునకు దోచునుగాని, గురువునకు దోచదు. ఏలాగనిన శిష్యుని కలలో దనతో మాట్లాడిన పెద్దమనుష్యుడును, నా ప్రసంగమును, నా మాట్లాడిన తానును మేలుకొని చూచువఱకు నేలాగబద్ధమో, యాలాగే శిష్యునకు బూర్ణబోధ కలుగు వఱకు బోధకుడైన గురుడును, బోధయును, బోధ బొందెడు తానను నభిమానియును. లేక పోవును గనుక గురుశిష్య రహితము కావలెను.

ప్రశ్న :- గురుశిష్య రహిత మేలాగు కావలెను?

ఉత్త :- కర్పూర శిఖివతును, నరణ్యదావాగ్ని వతును గావలెను. ఏలాగనిన, శిఖకర్పూరమును దహించి తానెటుల లేక పోయినదో దావాగ్ని యరణ్యమును దహించి తానెటుల లేక పోయినదో యటువలెనే తానను కల, గురు వాక్యమను మెలకువ చేత లేకపోయిన పిమ్మట, బంధమోక్షములును, ద్వంద్వాద్వములును గురు శిష్యులును, నేమి లేవని తెలిసికొనవలయును.

ప్రశ్న :- సమస్తమయిన వారలకు ముక్తి కావలయుననే కదా? తానున్న ముక్తి యేలాగున గలుగుచున్నది? తానులేక పోయినట్టులయితే ముక్తి యెవరికి?

ఉత్త :- సుషుప్తి వచ్చుచున్న సమయమందు జాగ్రత వదిలి సుషుప్తి బొందక మునుపు సుషుప్తి వచ్చుచున్నదని తెలిసి, తర్వాత నేలాగు తెలియదో, యాలాగుననే తానను నెఱుక లేక పోవుచున్నప్పుడు డెఱుక లేక పోవడమే ముక్తి॥ దీనికి సమ్మతి॥

శ్లో॥ **"ద్వేపదేబంధమోక్షాయ । మమేతినిర్మమేతిచ ।**

మమేతిబధ్యతేజంతు । నిర్మమేతి విముచ్యతి"॥ గురువు చెప్పుచున్నాడు. బిడ్డా! నీవడిగిన యన్ని ప్రశ్నలకు సదుత్తరములతో గోప్యములుంచక బోదచేసితిని. నేను జెప్పబోవు దానిని సావధాన చిత్తుడవై వినుము. ఉన్నదున్నట్టు లేనిది లేనట్టు జెప్పబడును. లోకులున్నది లేనట్టు, లేనిది యున్నట్టు నుభయసంధి తెలియక యీతోచునన్నియు సత్యమని యహంకారము చేత ననెదరు. నీవాలాగే సత్యమని నమ్మితే భ్రాంతి రహిత మెన్నటికి గానేరదు. ఇలకు మర్యాద చేయువారిలలో వారే అది యేలాగనిన నిలారూపకమైన యీ ప్రపంచములో బ్రపంచము వలెనే

లేకయుండు సకల నిర్ణయములు నిశ్చయమని బద్ధులైన వారు నమ్మియున్నారు. ఇలా నమ్మరాదు. ఈలాగున జెప్పితే నెవరును నమ్మరు. ఇదిగాక యేమార్గము నమ్మినను రాజమార్గమును విడిచి, కొండ త్రోవలకు జొచ్చిన సంగతి యగుచున్నది గాని, యదార్థముగా జన్మరాహిత్యమైన యుక్తి గలుగదని తోచుచున్నది. ఇందుకు భూమండలములో శరీరము లేని గురు సాంప్రదాయ మున్నదని యెవరు నెఱుగరు. నీవు మిక్కిలి జాగ్రతయు దీవ్ర ప్రజ్ఞయు జిత్త శుద్ధియు, సాధన చతుష్టయ సంపత్తియు, మిగుల వైరాగ్యమును గలవాడివై నన్ను జేరినావు. కాబట్టి వాక్యత్రయము లను బోధచేయ దలచినితిని గాన నేకాగ్ర చిత్తముతో శ్రద్ధాసక్తుడవై వినుము. ఈ యుత్తబట్టబయ లేమియులేదు. అని ద్వాదశాక్షరీ మంత్రమును మంత్రమూల మంత్రార్థములును బోధించి సౌజ్ఞ చేసి, సూచించెను. శిష్యుడు కుశాగ్రబుద్ధి గలవాడు కనుక గ్రహించి మౌనముగా నుండెను బిడ్డా! ఏమి దర్శించితివి? మౌనముతో మాట్లాడకుంటివనిన, సద్గురువర్యా! నాకు ముందు వెనుక, నిరుపర్శ్వములను, నడుమను. గ్రిందను, మీదను, దశదిక్కులను మిగిలియంతట నిండియుండు నచలమును జూచితిని బిడ్డా! అదెప్పుడు నున్నదా? నీవు చూచినప్పుడు మాత్రమే యున్నాదా? నాయానా! అచలము పుట్టనిది చావనిది తనకు దానే స్వతస్సిద్ధమై ప్రత్యక్షముగానున్నది. నేనున్నదని చెప్పినను నున్నది. లేదని చెప్పినను నున్నది. అనేక మంది లేదనినను నున్నది. నేను రాకమునుపు నున్నది. నేనున్నప్పుడును నున్నది. అది యిక్కడను నున్నది. సకల దేశముల యందును నున్నది. సర్వకాలముల యందును జలించక యున్నది. సమస్తమైన వస్తువుల యందును

Scanned by TapScanner

నున్నది. ఇట్లు చెప్పిన శిష్యుని జూచి, యానందభరితుండై యిట్లనియె. నాయనా! కొందఱచలమును దర్శించకయే యచలమని చెప్పుదురు. అది యేలాగనిన గని మొఱిగినవి కొన్ని, కానక మొఱిగినవి మఱికొన్ని యన్నట్లున్నది. అది యేమనిన, రాత్రి కాలమునందు నొక చోరుని జూచి యొక కుక్క మొఱుగ సాగెను. ఆ కుక్క మొఱిగెడు ధ్వని విని యా గ్రామములో నుండు కుక్కలన్నియు నా మనిషిని జూడకయే మొఱుగసాగెను. అటువలెనే యచలమును నిజముగా దర్శించి, యనుభవము గాక, వాచా వది రెడు నచలు లనేకురు గలరు, నీవు వారివలె గాక, యనుభ వాచలుడనై నందుకు నా చిత్తము రంజిల్లెను. మీ తండ్రి యుపనయన కాలమందుపదేశించిన గాయత్రి మంత్రమిదేయని యా మంత్రమును, నా మంత్రమూల మంత్రార్థములను దేట పడునట్లుగా బోధించెను.

బిడ్డా! ఎఱుకను దర్శించమని చెప్పదొడంగెను, వాక్యార్థపరు లెఱుకను నిజముగా దర్శించిన వారు గారు. నిజముగా దర్శించిన పుణ్య పురుషులు లోకమున నరుదుగా నుందురు.

బిడ్డా! ఎఱుకను దర్శించనేరక నిష్కళే తాననియు దానే పరబ్రహ్మ మనియు ననేక గ్రంథ శోధనలచే వాక్యార్థపరుడు చెప్పుట చేతనే బ్రహ్మాసిద్ధి కలుగ నేరదు. వాక్యార్థపరులనేకులున్నారు. ఎఱుకను నిజముగా దర్శించిన వారు లోకంబున నరుదుగా నుందురు. నిజముగా దర్శించు విధము చెప్పెదను వినుము. అది యెట్లనిన గంటి దృష్టివలన నామరూపాత్మకమైన ప్రపంచ మెఱుగబడుచున్నది. దర్పణము వలన దనముఖమును, నాసిక, నేత్రములును, గారణ స్వరూపమును దెలిసికొనినటుల నీలతోయదమందు నిలిచి,

Scanned by TapScanner

యార్యదర్పణము చేత నెఱుకను దర్శించమని - మూలములేని గుర్తెఱుగు శరీరమేమిలేదు - అని షోడశాక్షరి మంత్రమును, మంత్రమూల, మంత్రార్థములను బోధించి, యార్యదర్పణము చేత నెఱుకను జూపించెదను. శిష్యుడు చూచి, నాయనా! యెఱుకను దర్శించితిని. ఇతడే సర్వసాక్షియనియు, నిదే మూలమాయ యనియు, నితడే విరాట్టనియు, నితడే స్వరాట్టనియు, నితడే యింద్రజాలకుండనియు, శరీరము నాత్మ వేఱు కాదనియు, నీ రెండును నొక్కటే యనియు, నాకు దృఢమాయెను.

బిడ్డా! ఈ షోడశాక్షరీ మంత్రార్థమునే, నీకు నీ తల్లి, నీవు పసిబాలుడవుగా నున్న సమయమందు బోధించెను. నీకుంగల యజ్ఞానము చేత నీ మనస్సునకు బట్టకపోయెను. అయితే, స్వామీ! నా జనని బోధించిన దెద్ది నాకు దయతో నటిగింపుడు, బిడ్డా! నీవతి బాలుడవుగా నుండి యేడ్చు సమయంబున, నీ తల్లి నీ వీపున హస్తంబు జేర్చి, నిన్ను నిద్రపుచ్చుటకు నుద్దేశించి పాడిన జోల పాటకు బల్లవిగా-హుళిహుళిక్కి హాయి-అని రాగసరళితో బాడగా నీవా బోధార్థమును, నెఱుంగకయే హాయిని జెందితివి. అది యెట్లనిన, నీ తనువును జూపించి యిది హుళిహుళిక్కి, యనగా లేనిదని నిశ్చయమైతే నీవు హాయి బొందుదువని నీ తల్లి బోధించెను, అదే నేనిప్పుడు నీకు జెప్పితిని.

కలలో దోచిన పదార్థము లేలాగో యాలాగే యని పంచదశి మంత్రమును, మంత్రమూల మంత్రార్థములను బోధించెను.

బిడ్డా! కలలో వచ్చిన శరీరములును, రాజులును, భటులును, మేల్కొనిన గానంబడునా? వారిని నెవరు రప్పించిరి? తిరుగ నెవరు గొనిపోయిరి? అటువలెను ఈ నామరూపాత్మకమైన

విశ్వము కలలో నుండువారికి దోచునేగాని, గురువాక్యమును మంత్రముచేత మేలుకొన్నవారికి దోచదు. తోచునదే భ్రాంతి. బిడ్డా! మేము గురువులము, నీవు శిష్యుడవు. మాకు గురు దక్షిణ సమర్పింపుమని యడిగెను. సద్గురువర్యా! నన్ను దప్ప నావద్ద నేమియున్నది? కాబట్టి యేమి దక్షిణ సమర్పింపగలను, మీరేనేనైయున్నాను. పరిపూర్ణము తప్ప మఱేమియును లేదు. మీరేమి సమర్పింపమని యానతిచ్చెదరో, యది మీకు సమర్పించెదను. బిడ్డా! పరిపూర్ణమును నెఱిగిన యేయెఱుక గలదో, దాని గురుదక్షిణగా సమర్పింపవలయును. అటుల నీవు సమర్పించిన యెఱుకను తిరిగి పుచ్చుకొనిన యెడల గురు ద్రోహ మవును. కాబట్టి నీవు మరల దానికి నాశపడకుము. శిష్యుడత్యంత సంతోషముతో గురువునకు నెఱుకను సమర్పింపదలచి గురువునకు బ్రదక్షిణము జేసి గురు పాదములను తన నేత్రములందు గలిగిన యానంద బాష్పములచే గడిగి, హృదయ కమలమందు నిలుపుకొని, నిశ్చలచిత్తముతో నా మహాత్ముని పాదములయందు సుగంధము బూసి, వివిధ పుష్పములతో సువర్ణ రత్నములతో బూజించి యెఱుకను గురుదక్షిణగా సమర్పించి యేమియు గాక పరిపూర్ణుడై యుండెను. అట్టి శిష్యుని సద్గురుడు చూచి, తనకు సమర్పించిన యెఱుకను దను మనో ధనములన మఱల గ్రహించునో లేదో, పరీక్షంతమనియు, శిష్యునకు దృఢ చిత్తమును, సమరసభావమును, నభేదమును, నరిషడ్వర్గములను విడిచియు, నీర్ష్యాసూయతలు లేకయు నున్నాడో లేడో యని యోచించి యనేక విషపరీక్షలు గావించిరి. అందుకు జలన రహితుండనై విష పీయూషములు సమానములుగాను, మేధ్యామేధ్యములు

సమములుగాను, గుణములు భేదించకయు, ముఖము వాడకయు, సద్గురుని యాజ్ఞకు వెనుక దీయకయు, ధీరుండనై యుండునట్టి నన్నుంగాంచి సంతోషానందభరితుండై నిజ గురుడు పక్కున నవ్వి నన్నుం గౌగిలించుకొని, బిడ్డా! నీ యొక్క పరిపూర్ణ సిద్ధినిం గనుగొంటినని దీవించెను. ఇదియే పరిపూర్ణసిద్ధి. ఇదియే యచల పరిపూర్ణ భావము. ఇదియే నిజగురు సాంప్రదాయము.

ఇది శ్రీమద్వేదాంతసార సచ్చిదానంద రహిత నాదబిందు కళా
తీతుండను, ప్రకృతి ద్వయదోష రహితుండును, నిర్వికార
నిరంజనుండును, నచల పరిపూర్ణుండును, నశరీరుండును
నగు, పులహరి–ఫీరోజి దేశిక స్వాములవారి కటాక్షం
బున దిరుచునాపల్లి, రంగస్వామి సెట్టి చేత నాంధ్రం
బున వచన కావ్యంబుగ రచియింపబడి, యచల
గురుండగు, పోకల – శేషాచలాహ్వాయునిచే
దిద్దుబాటు చేయించి ప్రచురింపంబడిన
ముక్తిప్రదాయిని యను గురుశిష్య
సంవాద రూపకమగు – నచల
మార్గము సర్వంబును
సమాప్తము.

Scanned by TapScanner

శ్రీ పోలకం నరసింహ స్వాముల వారు



శ్రీ కుప్పం రంగయ్య స్వాముల వారు



శ్రీ పోరంకి సూర్యనారాయణ రాజార్యులు

శ్రీ పోలకం నరసింహ స్వాముల వారి అచల మందిరము, ఇప్పటం

గ్రంథ దాతలు

శ్రీ కలిశెట్టి చిన నరసింహారావు గారి దంపతులు, గోనుగుంట

శ్రీ పూర్ణానంద బూతుకూరి వెంకటప్పారెడ్డి, నాదెండ్ల

Scanned by TapScanner